జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | మంగళవారం 22 ఏప్రిల్ 2025 | సంపుటి : 15 | సంచిక : 226 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రమ సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# భూ రిజిస్ట్రేషన్ల ఆదాయానికి గండి

- అశాస్త్రీయంగా భూముల ధరలు పెంచిన వైఎస్సార్సీపీ
- ప్రజలపై భారం మోపడంతో తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం
- తగ్గిన డాక్యుమెంటు రిజిస్ట్రేషన్లు
- రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తీసుకురావడంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు



**అమరావతి**

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గత ఆర్థిక సంవత్సరంలో భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయం భారీగా తగ్గింది. విజయనగరం జిల్లాలో 11, పార్వతీపురం మన్యం జిల్లాలో 4 చొప్పున సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. విజయనగరం జిల్లాలో 2023-24లో విధించిన వార్షిక ఆదాయం లక్ష్యంలో 71 శాతం, 2024-25 వార్షిక ఆదాయం లక్ష్యంలో 65.90 శాతం సాధించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 2023-24 వార్షిక ఆదాయ లక్ష్యంలో 58.30 శాతమే సాధించారు. 2024-25లో మాత్రం ఇక్కడ లక్ష్యసాధనలో మెరుగుదల కనిపించింది. గతేడాది వైఎస్సార్సీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా భూముల ధరలు పెంచి ప్రజలపై భారం మోపడంతో దాని ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడి ఆదాయం తగ్గుముఖం పట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఫిబ్రవరిలో శాస్త్రీయ విధానంలో భూముల ధర పెంపునకు నిర్ణయించింది. భూముల రిజిస్ట్రేషన్ల విలువల్లో మార్పులు చేసింది. గత ప్రభుత్వంలో పెంచిన విలువలు సవరించింది. కొన్ని ప్రాంతాల్లో విలువ తగ్గించగా మరి కొన్ని చోట్ల పెంచింది. మరి కొన్ని చోట్ల యథాస్థితిని కొనసాగించింది. దీని ప్రభావం వల్ల 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం బాగా పడిపోయింది. ఉభయ జిల్లాలు వార్షిక - మిగతా3లో



## ఇప్పటికే అలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నాం

- ఇప్పుడు ఆదేశాలు ఇవ్వాలా?
- పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్
- ఇప్పటికే కార్య నిర్వాహక వ్యవస్థలో జోక్యం చేసుకుంటున్నామనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాం

2



## రూ. 500 నోట్లపై కీలక అప్ డేట్

- ప్రస్తుతం టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందింది
- ఈ అభివృద్ధి చెందిన టెక్నాలజీని మానవాళి మంచికి వినియోగిస్తే మంచిదే
- సరికొత్త టెక్నాలజీ వినియోగించి రూ.500 దొంగ నోట్లు చెలామణిలోకి
- కేంద్ర హోం మంత్రిత్వ శాఖ హెచ్చరికలు జారీ

2

## ఏపీ సిట్ అధికారుల అదుపులో రాజ్ కేసిరెడ్డి



- సిట్ విచారణకు హాజరయ్యేందుకు దుబాయ్ నుంచి హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు.
- ఈ క్రమంలో రాజ్ కేసిరెడ్డిని ఏపీ సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.
- సిట్ విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో రాజ్ కేసిరెడ్డి ఓ ఆడియోని విడుదల

3

## శంకర్ విలాస్ ఆర్వోబీ ఎట్టిపరిస్థితుల్లోనూ ఆగదు



- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- కేంద్రం మద్దతుతో నెలల వ్యవధిలోనే శంకర్ విలాస్ ఆర్వోబీ అనుమతులు
- వంతెన నిర్మాణం ముందుకెళ్లకుండా చేయడమే కొందరి ఆలోచన



## భారతీయుల పట్ల ఆయనకున్న ప్రేమ ఎల్లప్పుడూ గుర్తుండిపోతుంది

- పోప్ మరణ వార్త తీవ్ర బాధను కలిగించింది
- పోప్.. చిన్నప్పటి నుంచీ ఆయన ప్రభువైన క్రీస్తు ఆదర్శాలను సాకారం చేసుకోవడానికి తనను తాను అంకితం చేసుకున్నారు
- పేదలు, అణగారిన వర్గాలకు ఎంతో శ్రద్ధగా సేవ చేశారు.
- పోప్ మృతికి ప్రధాని సంతాపం

## మోదీ పర్యటనతో అమరావతి పనులు ఊపందుకుంటాయి



- ప్రధాని వచ్చి వెళ్లేవరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించాం
- సభావేదిక వద్దకు చేరుకునేందుకు 7 రహదారులు ఉన్నాయి
- అన్ని మార్గాల్లోనూ వేదిక వద్దకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం
- గత ఐదేళ్లు రాజధాని రైతులను అప్పటి ప్రభుత్వం ఇబ్బందులు పెట్టింది
- మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, నారాయణ, ఉన్నతాధికారులతో సమీక్ష

**అమరావతి**

ప్రధాని మోదీ పర్యటనతో అమరావతిలో పనులు మరింత ఊపందుకుంటాయని ఏపీ మంత్రులు తెలిపారు. ఏపీ పర్యటనలో భాగంగా మే 2న సాయంత్రం 3 గంటలకు ఆయన గన్నవరం చేరుకుంటారని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, నారాయణ, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని వచ్చి వెళ్లేవరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించామన్నారు. సభావేదిక వద్దకు చేరుకునేందుకు 7 రహదారులు ఉన్నాయని, అన్ని మార్గాల్లోనూ వేదిక వద్దకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. అధికారులందరికీ బాధ్యతలు అప్పగించినట్లు - మిగతా3లో

## 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి

- 202 మీటర్లు పూర్తైన డయాఫ్రమ్ వాల్
- మీడియాతో జన వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- కొత్తగా డయా ఫ్రమ్ వాల్ నిర్మాణ పనులను 990 కోట్లతో జనవరి 18న మొదలుపెట్టాం
- ఏప్రిల్ 30 కల్లా మూడవ కట్టర్ కూడా అందుబాటులోకి రానుంది

**రాజమండ్రి**

పోలవరం ప్రాజెక్టు పనులను 2027 చివరి నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం రాజమండ్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ కు సంబంధించి ఇప్పటివరకు 202 మీటర్ల నిర్మాణం పూర్తయినట్లు డయాఫ్రం వాల్ జగన్ పాలనలో విధ్వంసానికి గురికాగా నేడు కూటమి ప్రభుత్వంలో నిర్మాణం దశగా పనులు - మిగతా3లో



## ఏఐతో భారీ నిరుద్యోగం తప్పదు

- ఏఐ వల్ల ఉద్యోగాలకు పెను ముప్పు: గేట్స్, ఒబామా ఆందోళన
- ఇది గత శతాబ్దంలో చూడని మార్పుగా అభివర్ణన
- వైద్యులు, టీచర్ల వంటి మేధస్సు ఏఐతో సులభంగా లభ్యం: గేట్స్
- అన్ని రంగాలపై ఏఐ ప్రభావం, కోడింగ్ ఉద్యోగాలకూ ప్రమాదం: ఒబామా
- జీవనోపాధి మార్గాలపై పునరాలోచన తప్పనిసరి అని వెల్లడి

2



# ఏఐతో భారీ నిరుద్యోగం తప్పదు



కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మానవ జీవితంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్న తరుణంలో, దాని వల్ల ఉద్యోగ భద్రతకు ఏర్పడబోయే ముప్పుపై ప్రపంచ దిగ్గజాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఏఐ ప్రభావంపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే సంవత్సరాల్లో ఏఐ లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేస్తుందని, ఇది గత వందేళ్లలో ప్రపంచం చూడని అతిపెద్ద మార్పు కానుందని వారు స్పష్టం చేశారు. బిల్ గేట్స్ మాట్లాడుతూ, ప్రస్తుతం అరుదుగా లభించే మేధస్సు (ఉదాహరణకు గొప్ప వైద్యులు, ఉపాధ్యాయుల నైపుణ్యం) ఏఐ సహాయంతో రాబోయే దశాబ్ద కాలంలో ఉచితంగా, సర్వసాధారణంగా అందుబాటులోకి వస్తుందన్నారు. "ఇది వైద్య సలహాలు, ట్యూటరింగ్ వంటి అనేక సమస్యలను పరిష్కరిస్తుంది. అయితే, ఇది ఉద్యోగాల స్వరూపాన్ని, పని విధానాలను పూర్తిగా మార్చివేస్తుంది. వారానికి రెండు, మూడు రోజులు పనిచేస్తే సరిపోతుందేమో" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఏఐ ఆవిష్కరణలను ముందుకు తీసుకెళుతుందని అంగీకరిస్తూనే, దానివల్ల కలిగే మార్పులు కొంత భయానకంగా ఉన్నాయని గేట్స్ వ్యాఖ్యానించారు. మరోవైపు, బరాక్ ఒబామా మాట్లాడుతూ, ఏఐ సాంకేతికత గతంలోని అన్ని టెక్నాలజీ మార్పుల కంటే వేగంగా, మరింత ప్రభావవంతంగా ఉండబోతోందని హెచ్చరించారు. "ఇది కేవలం తయారీ రంగంలోని ఆటోమేషన్ లాంటిది కాదు. ఉన్నత స్థాయి మేధోపరమైన పనులను కూడా ఏఐ చేయగలదు. ఇప్పటికే చాలా మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్ల కంటే మెరుగ్గా ఏఐ కోడింగ్ చేయగలుగుతోంది. సిలికాన్ వ్యాలీలో మంచి జీతాలతో ఉన్న ఉద్యోగాలు కూడా ప్రమాదంలో పడతాయి" అని ఒబామా వివరించారు. అత్యున్నత నైపుణ్యం గల నిపుణులు ఏఐని తమ పనిని మెరుగుపరుచుకోవడానికి ఉపయోగిస్తారని, కానీ సాధారణ స్థాయి ఉద్యోగాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఒబామా అన్నారు. "కేవలం కార్మికులు, ఫ్యాక్టరీ ఉద్యోగులే కాదు, ఇప్పుడు అందరూ 'ఉద్యోగం ఎలా సంపాదించాలి? కుటుంబాన్ని పోషించుకోవడానికి ఆదాయం ఎలా పొందాలి?' అని ఆలోచించాల్సిన పరిస్థితి వస్తుంది. మనం ఎంతో ఉత్పత్తి చేస్తున్నప్పుడు, దాన్ని ఎలా పంపిణీ చేయాలి? జీవితంలో మన పరమార్థం ఏమిటి? అనే ప్రశ్నలను మనమందరం ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ఒబామా నొక్కిచెప్పారు.

# ఇప్పటికే అలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నాం



**న్యూఢిల్లీ:** న్యాయవ్యవస్థపై ఉపరాష్ట్రపతి సహా పలువురు బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. ప్రస్తుతం తాము కార్య నిర్వాహక వ్యవస్థలో జోక్యం చేసుకుంటున్నామనే ఆరోపణలు ఎదుర్కొంటున్నామంటూ సోమవారం వ్యాఖ్యానించింది. ముర్షిదాబాద్ అల్లర్ల కేసు నేపథ్యంతో.. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ విష్ణు శంకర్ జైన్ అనే న్యాయవాది సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలో జస్టిస్ గవాయ్ పిటిషన్‌ను పరిశీలిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "మేం ఇప్పటికే కార్య నిర్వాహక వ్యవస్థలో జోక్యం చేసుకుంటున్నామనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాం. ఇలాంటి తరుణంలో.. బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని, సైన్యాన్ని మోహరింపజేయాలని మాండమస్ రిట్ ప్రకారం రాష్ట్రపతికి ఆదేశాలు ఇవ్వాలా?" అని పిటిషనర్ లాయర్‌ను ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పిటిషనర్ కోరిన ఆదేశాలు జారీ చేయడానికి బెంచ్ నిరాకరించింది. ఇదిలా ఉంటే.. రాష్ట్రాలు రూపొందించే బిల్లుల విషయంలో గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరును సుప్రీం కోర్టు తప్పుబడుతూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో గవర్నర్, రాష్ట్రపతికి సైతం కాలపరిమితి విధించింది. ఈ వ్యవహారంలో రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అధికారాలు పని చేయబోవని.. ఒకవేళ ఆ కాలపరిమితిని ఉల్లంఘిస్తే కోర్టులను ఆశ్రయించొచ్చని రాష్ట్రాలకు సూచించింది. అదే సమయంలో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లనూ విచారిస్తూ.. స్టే ఆదేశాలు జారీ చేసింది కూడా. అయితే ఈ రెండు పరిణామాలపై బీజేపీ నేతలు కొందరు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే సుప్రీం కోర్టుపై చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. ఒకవేళ సుప్రీంకోర్టు చట్టాలు చేస్తే గనుక.. పార్లమెంట్ భవనాన్ని మూసివేయాలి" అని ఎంపీ వ్యాఖ్యానించారు. మరో బీజేపీ నేత దినేశ్ శర్మ సైతం సుప్రీం కోర్టుపై విమర్శలు గుప్పించారు. ఆఖరికి ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్ కూడా సుప్రీం కోర్టు తీర్పును తప్పుబట్టారు. 'రాష్ట్రపతికి గడువు నిర్దేశించేలా న్యాయవ్యవస్థ వ్యవహరించడం తగదు. అది ప్రజాస్వామ్యశక్తులపై అణుక్షిపణిని ప్రయోగించడమే అవుతుంది. ఇప్పుడు.. శాసనాలు చేయగలిగే జడ్జీలు మనకు ఉన్నారు! కార్యనిర్వాహక విధులూ వారే నిర్వర్తించేస్తారు. సూపర్ పార్లమెంటులా వ్యవహరిస్తారు. వారికి మాత్రం ఎలాంటి జవాబుదారీతనం ఉండదు. ఎందుకంటే దేశ చట్టాలు వారికి వర్తించవు" అని అన్నారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి నోట్ల కట్టల వ్యవహారంపై స్పందిస్తూ దన్‌ఖడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక బీజేపీ నేతల వ్యాఖ్యలను వ్యతిగతం అని పేర్కొంటూ అధిష్టానం దూరంగా ఉంటున్నట్లు ప్రకటించింది. అయినప్పటికీ ప్రతిపక్షాలు ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాయి. ప్రస్తుతం సీజేఐగా ఉన్న సంజీవ్ ఖన్నా పదవీ కాలం త్వరలో ముగియనుంది. ఆ స్థానంలో బీఆర్ గవాయ్ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. కీలకమైన వక్ఫ్ పిటిషన్లపై ఈయనే విచారణ జరపబోతున్నారు. ఈ క్రమంలో.. ఆయన కార్య నిర్వాహక వ్యవస్థపై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇదిలా ఉంటే.. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 8-12 తేదీల మధ్య షంషేర్‌గంజ్, సూటి, ధులియాన్, జంగిపూర్ ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. ముగ్గురు మరణించగా.. వందల మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన 73 పిటిషన్లనువిచారించే క్రమంలోనూ ఈ అల్లర్లను సీజేఐ సంజీవ్ ఖన్నా ధర్మాసనం ప్రస్తావించింది. మే 5వ తేదీన ఈ పిటిషన్లపై విచారణ జరగనుంది.

## రూ. 500 నోట్లపై కీలక అప్ డేట్

**న్యూఢిల్లీ :** ప్రస్తుతం టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధి చెందిన టెక్నాలజీని మానవాళి మంచికి వినియోగిస్తే మంచిదే. కానీ అదే దుర్వినియోగం అయితే మాత్రం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది. బ్యాంక్ అకౌంట్‌లో నగదు వేసి.. ఇంటికి తిరిగి వచ్చేసరికి.. సైబర్ నేరగాళ్ల తమ మాయోపాయంతో వాటిని కొట్టేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో.. సరికొత్త టెక్నాలజీ వినియోగించి రూ.500 దొంగ నోట్లు చెలామణిలోకి వచ్చినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వీటి విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. ఈ దొంగ నోట్లు దాదాపుగా అసలు నోట్లను పోలి ఉన్నాయని వివరించింది. చాలా పరీక్షగా గమనిస్తేనే కానీ.. అసలు నోటుకు, నకిలీ నోటుకు తేడా తెలియని విధంగా ఉన్నాయని స్పష్టం చేసింది. యితే ఈ దొంగ నోట్లకు, అసలు నోట్లకు మధ్య తేడాను చిన్న స్పెల్లింగ్ ఉందని.. దీనిని ఇట్టే గుర్తించ వచ్చని ప్రజలను సూచించింది. దీనిని గుర్తించడంలో ఇదే కీలకమని పేర్కొంది.కరెన్సీ నోట్లపై సాధారణంగా RESERVE BANK OF INDIA అని ఉంటుందని.. కానీ దానిలో RESERVE అనే పదంలో E కి బదులుగా A అని ఉంటుందని.. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు స్పష్టంగా పరిశీలించాలని ప్రజలకు సూచించింది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని బ్యాంకులు, సంస్థలు, ఏజెన్సీలను సూచించామని వివరించింది. ఈ విషయంలో ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సూచించింది. ఇక ఈ సమాచారాన్ని డీఆర్ఐ, సీబీఐతోపాటు ఎన్ఐఏతో సైతం పంచుకున్నట్లు వివరించింది.

## రెండు వారాల్లో మూడోసారి.. వేదిక పంచుకున్న శరద్ పవార్, అజిత్ పవార్



**ముంబై:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ మరోసారి ఒకే వేదికను పంచుకున్నారు. గత పక్షం రోజుల్లో వారిద్దరూ కలిసి ఒకే వేదికపై కనిపించడం ఇది మూడోసారి. ఈ నేపథ్యంలో రాజకీయంగా ఇది చర్చకు దారి తీసింది. సోమవారం పూణెలోని సఖర్ సంకుల్ (షుగర్ కాంప్లెక్స్)లో జరిగిన సమావేశంలో శరద్ పవార్, అజిత్ పవార్ ఒకే వేదికపై ఆసీనులయ్యారు. వసంతదాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు కూడా హాజరయ్యారు. కాగా, ఈ సమావేశం తర్వాత అజిత్ పవార్ మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడానికి, భూసారాన్ని మెరుగుపరచడానికి, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడానికి ఏఐని ఉపయోగించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. మరోవైపు శరద్ పవార్, అజిత్ పవార్ తిరిగి దగ్గరవుతున్నట్లుగా గత కొన్ని నెలలుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండు వారాల్లో మూడోసారి శరద్ పవార్‌తో వేదిక పంచుకోవడం గురించి అజిత్ పవార్‌ను మీడియా అడిగింది. అయితే వేరే కోణంలో దీనిని అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. తన కుమారుడు జై నిశ్చితార్థం తర్వాత మరో కార్యక్రమంలో తామిద్దరం కలిసినట్లు చెప్పారు. ఈ సమావేశాలకు రాజకీయ ప్రాముఖ్యత లేదని అన్నారు.

## భారతీయుల పట్ల ఆయనకున్న ప్రేమ ఎల్లప్పుడూ గుర్తుండిపోతుంది



క్యాథలిక్ మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఇవాళ ఉదయం వాటికన్ సిటీలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని వాటికన్ సిటీ అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో పోప్ మృతిపట్ల పలువురు ప్రపంచ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం పోప్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోప్ మరణ వార్త తీవ్ర బాధను కలిగించిందన్నారు. భారత ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమ ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'పవిత్ర పోప్ ఫ్రాన్సిస్ మరణం తీవ్ర బాధ కలిగించింది. ఈ విషాద సమయంలో ప్రపంచ క్యాథలిక్ సమాజానికి నా హృదయపూర్వక సంతాపం తెలియజేస్తున్నాను. పోప్.. చిన్నప్పటి నుంచీ ఆయన ప్రభువైన క్రీస్తు ఆదర్శాలను సాకారం చేసుకోవడానికి తనను తాను అంకితం చేసుకున్నారు. పేదలు, అణగారిన వర్గాలకు ఎంతో శ్రద్ధగా సేవ చేశారు. ఆయనతో సమావేశమైన సందర్భాలను నేను ఎప్పటిగా ప్రేమతో గుర్తుంచుకుంటాను. ఆయన నుంచి ఎంతో ప్రేరణ పొందాను. భారత ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమ ఎల్లప్పుడూ గుర్తుండిపోతుంది' అని ప్రధాని తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు గతంలో వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్‌ను కలిసిన సందర్భంగా దిగిన ఫొటోలను పంచుకున్నారు. అక్టోబర్ 2021లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. జీ-20 సదస్సులో పాల్గొనేందుకు ఇటలీ వెళ్లిన ప్రధాని.. వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్‌ను కలిశారు. దాదాపు 30 నిమిషాలపాటు పోప్ ఫ్రాన్సిస్, ప్రధాని మోదీ వివిధ విషయాలపై మాట్లాడుకున్నారు. అనంతరం భారత్‌కు రావాల్సిందిగా పోప్‌ను ప్రధాని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనకు పలు ప్రత్యేకమైన బహుమతిని కూడా అందజేశారు. పూర్తిగా సిల్వర్‌తో తయారు చేసిన క్యాండిల్ స్టాండ్, ఓ పుస్తకాన్ని పోప్‌కు ప్రధాని బహుమతిగా ఇచ్చారు. ఫ్రాన్సిస్ కూడా మోదీకి ఓ గిఫ్ట్ ఇచ్చారు. బ్రాంజ్‌తో తయారు చేసిన ఓ సర్క్యులర్ మెమోంటోను అందజేశారు. బైబిల్ సూక్తులతో ఉన్న ఆ గిఫ్ట్‌ను మోదీ అందుకున్నారు.

## ఇస్రో ఖాతాలో మరో ఘనత.. స్పేడెక్స్ రెండో డాకింగ్ ప్రక్రియ సక్సెస్



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో మరో కీలక ముందడుగు పడింది. తొలి ప్రయోగంలో అంతరిక్షంలోనే ఉపగ్రహాలను అనుసంధానం చేసిన శాస్త్రవేత్తలు.. రెండో డాకింగ్ ప్రక్రియను కూడా సక్సెస్‌ఫుల్ గా పూర్తి చేశారు. ఈ విషయాన్ని ఇస్రో అధికారికంగా ప్రకటించింది. "ఉపగ్రహాల రెండవ డాకింగ్ విజయవంతంగా పూర్తయిందని తెలియజేయడానికి సంతోషంగా ఉంది" అని పేర్కొంటూ కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ %‌%‌ వేదికగా ఇలా ట్వీట్ చేశారు. "స్పేస్-బేస్డ్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ మిషన్‌ను PSLV-C60 ద్వారా డిసెంబర్ 30, 2024న ప్రయోగించాం. ఈ మిషన్‌లో భాగంగా ఇస్రో శాస్త్రవేత్తలు జనవరి 16, 2025న అంతరిక్షంలో తొలిసారి ఉపగ్రహాలను విజయవంతంగా డాక్ చేసి సృష్టించారు. అనంతరం మార్చి 13, 2025న ఉదయం 9:20 గంటలకు అన్‌డాక్ చేశాం" అని ఎక్స్ పోస్ట్ ద్వారా కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ మిషన్ కింద రాబోయే రెండు వారాల్లో మరిన్ని ప్రయోగాలు జరగనున్నట్లు వెల్లడించారు. మార్చి 13న, ఇస్రో తన SpaDeX మిషన్ లో భాగంగా స్పేస్ డీ-డాకింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మన దేశం సొంతంగా అంతరిక్ష నౌకలు డాక్ చేయడానికి వీలు కల్పించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు. భూమి నుంచి నావిగేషన్ చేయాల్సిన అవసరం లేకుండా ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. చంద్రయాన్-4, 2035 కల్లా అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం, మానవ సహిత అంతరిక్ష మిషన్లు వంటి భవిష్యత్ ప్రాజెక్టులకు ఈ సాంకేతికత చాలా అవసరం.

**మిషన్ ప్రయోజనాలు**

భారతదేశం 2035 లో తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని స్థాపించాలని యోచిస్తోంది. ఈ మిషన్ విజయం దీనికి చాలా కీలకం. భారత అంతరిక్ష కేంద్రంలో ఐదు మాడ్యూళ్లు ఉంటాయి, వీటిని అంతరిక్షంలోకి తీసుకువస్తారు. వీటిలో మొదటి మాడ్యూల్ 2028 లో ప్రారంభమవుతుంది. ఈ మిషన్ చంద్రయాన్-4 వంటి మానవ సహిత అంతరిక్ష ప్రాజెక్టులకు కూడా ముఖ్యమైనది. ఉపగ్రహ మరమ్మత్తు, ఇంధనం నింపడం, శిథిలాల తొలగింపు వంటి పనులు పూర్తిచేసేందుకు ఈ టెక్నాలజీ ఉపకరిస్తుంది. ఒకసారి ప్రయోగించలేని భారీ అంతరిక్ష నౌకలు, పరికరాలు అవసరమయ్యే మిషన్లకు ఈ సాంకేతికత చాలా ముఖ్యమైనది.

## వెహికల్‌పై ఆ స్టిక్కర్లు లేకుంటే రూ.5000 జరిమానా



ఢిల్లీ మోటార్ వాహన చట్టంలోని నిబంధనల ప్రకారం.. ఇంధన రకాన్ని సూచించే కలర్ కోడెడ్ స్టిక్కర్లను తప్పకుండా అంటించాలి. ఈ నియమాన్ని అతిక్రమించిన వాహనాలపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ వెల్లడించింది. నిబంధనలు పాటించకపోతే మోటారు వాహన చట్టం కింద రూ. 5000 జరిమానా విధిస్తారు. ఈ స్టిక్కర్లు 2012-13లో ప్రవేశపెట్టబడిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్స్‌లో భాగంగా తీసుకొచ్చారు. ఆ తరువాత 2019 నాటికి అన్ని వాహనాలను ఈ స్టిక్కర్లు తప్పనిసరి అంటూ ఢిల్లీ రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. వాహనాలకు కలర్ కోడెడ్ స్టిక్కర్లను అతికించని వాహనదారులు జరిమానా చెల్లించడం మాత్రమే కాకుండా.. పొల్యూషన్ సర్టిఫికెట్ కూడా పొందలేరు. నిబంధనల ప్రకారం, డీజిల్ వాహనాలకు నారింజ రంగు స్టిక్కర్లు, పెట్రోల్ %‌% సీఎన్‌జీ వాహనాలకు లేత నీలం రంగు స్టిక్కర్లు. మిగిలిన అన్ని వాహనాలకు బూడిద రంగు స్టిక్కర్లు తప్పనిసరిగా అతికించాలి.

# ఎమ్మెల్సీ అనంతబాబుకు ఉచ్చు



**కాకినాడ :** తన దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న దళిత కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం ను హత్య చేసి ఆపై డోర్ డెలివరీ చేసిన సంఘటన పై ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.. దీనిపై తమకు ఇంకా సరైన న్యాయం జరగలేదంటూ మృతుడి కుటుంబికులు ఎన్నికలకు ముందు చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై న్యాయ విచారణ చేపట్టి న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఈ సంఘటనపై న్యాయ విచారణకు ఆదేశించింది.. కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం రంపచోడవరంకు చెందిన వైసీసీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు.. చాలా కాలంగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం మానేశాడు.. ఇదిలా ఉంటే 2022 మే 19న ఇంటి నుంచి వెళ్లిన సుబ్రహ్మణ్యం తిరిగి రాలేదు. అయితే తెల్లవారు జామున ఓ కారులో గుర్తు తెలియని వ్యక్తి సుబ్రహ్మణ్యం మృతదేహం తీసుకొచ్చి వదిలి వెళ్లిపోయాడు. ఈ సంఘటన అప్పట్లో తీవ్ర సంచలనం రేకెత్తించింది. దళిత సంఘాలు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి.. అయితే వైసీపీ ప్రభుత్వం నిందితున్ని కాపాడుతోందని ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి.. ఈక్రమంలోనే అత్యంత దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబు పై కాకినాడ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అప్పట్లో పోలీసుల వైఖరిపై తీవ్రస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు ఎమ్మెల్సీ అనంతబాబును అరెస్ట్‌చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు పోలీసులు.. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అలియాస్ అనంత బాబు డోర్ డెలివరీ కేసులో న్యాయ విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ న్యాయ విచారణలో ప్రాసిక్యూషన్ కు సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ మరియు మానవ హక్కుల రక్షణ కోసం సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న ముప్పాళ్ళ సుబ్బారావును నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 538 ని విడుదల చేసింది. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ముప్పాళ్ళ సుబ్బారావు అండగా నిలిచారు. వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయస్థానాల్లో పోరాటం చేసేందుకు నేనున్నానంటూ నిలబడ్డారు. ముప్పాళ్ళ సుబ్బారావు మడమతిప్పని పోరాటం వల్ల ఎమ్మెల్సీ అనంత బాబుకు స్థానిక న్యాయస్థానాల్లో బెయిల్ లభించలేదు. చివరికి సుప్రీంకోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం అనంత బాబు బెయిల్ పై ఉన్నారు. దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితులు తప్పించుకునే విధంగా పోలీసులు చార్జిషీట్ రూపకల్పన చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.. హత్య సంఘటన అనంతరం 88 రోజులకు దాఖలు చేసిన చార్జిషీట్‌ను అప్పట్లో న్యాయ స్థానం తిరస్కరించింది. అందులో సాంకేతి ఆధారాలు, నిందితుల కదలికలు తదితర అంశాలు లేకుండా చార్జిషీట్‌లో లేకపోవడమే తిరస్కరణకు కారణమని బాధితుల తరపున వాదించిన న్యాయవాది సుబ్బారావు వెల్లడించారు. 2023 ఏ?రపిల్ 14న అనుబంధ చార్జిషీట్‌ను వేశారు. గడువులో దాఖలు చేయకుండా నిందితుడుకు బెయిల్ వచ్చేవిధంగా అప్పటి ఎస్పీ, డీఎస్పీ ఆలస్యం చేశారని విమర్శలున్నాయి.. అప్పట్లో తానే హత్యచేశానని విచారణలో ఎమ్మెల్సీ అనంతబాబు అంగీకరించినట్లు మీడియా సమావేశంలో ఎస్పీ వెల్లడించారు కూడా.. చార్జిషీట్ ఆలస్యం వల్లనే మధ్యంతర బెయిల్ వచ్చిందని దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే మృతుడి తల్లితండ్రులు నూకాలమ్మ,సత్యనారాయణలు మాత్రం మూడేళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ కేసును రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం జరిగేలా విచారణకు ఆదేశిస్తారని భావిస్తూ వచ్చారు. సరిగ్గా ఇప్పుడు అదే జరిగింది. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసులో ప్రత్యేక కౌన్సిల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక న్యాయవాదిగా మంచి ట్రాక్ రికార్డు కలిగిన ముప్పాళ్ళ సుబ్బారావును ఈ కేసులో సహాయం చేయడానికి ప్రత్యేక న్యాయవాదిగా నియమించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్సీ అనంత బాబు కేసులో న్యాయం గెలుస్తుందన్న నమ్మకం ఇప్పుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబంతో పాటు దళితుల్లోనూ కలుగుతోందంటున్నారు..

# కారుమూరి మెడకు 690 కోట్ల టీడీఆర్ స్కాం



**ఏలూరు :** ఈ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొత్తం 754 కోట్ల రూపాయల విలువచేసే బాండ్లు జారీ చేస్తే అందులో దాదాపు 691 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఏలూరు జిల్లా వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన చేసిన హాట్ కామెంట్స్ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్నాయి. ఆయన చేసిన కామెంట్స్ కూటమి ప్రభుత్వంతో పాటు మళ్ళీ పాత కేసులను బయటకు తోడేలా చేసేయంటూ టాక్ విన్పిస్తోంది.ఇటీవల ఎంపీపీ ఎన్నికల సమయంలో టిడిపి నాయకులు చేసిన వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో వైసిపిపై దాడులు చేస్తే మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు వరకు ఇంటి నుండి బయటకు లాగి కొడతామనీ, గుంటూరు తర్వాత నరికి చంపేస్తామని కారుమూరి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీలో పెను దుమారాన్నే రేపుతున్నాయి. ఈ కామెంట్స్ పై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కూటమి నేతలంతా తీవ్రంగా స్పందించారు. తణుకు నియోజవర్గంలో కొందరు టిడిపి నాయకులు కారుమూరి వల్ల తమకు ప్రాణహాని ఉందంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేశారు.ఎప్పుడు సైలెంట్ గా ఉండే కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సైతం కారుమూరి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసాపురంలో జరిగిన సభలో మాట్లాడుతూ? రాజకీయ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్న హెచ్చరించిన వర్మ?ఆ తర్వాత పాలకొల్లు నియోజకవర్గంలో జరిగిన సభలో మాత్రం కారుమూరిపై అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ఎన్డీఏ కూటమి పార్టీల కార్యకర్తల జోలికి వస్తే చేతులు, కాళ్లు నరికేస్తానంటూ కేంద్రమంత్రి ఘాటుగా వ్యాఖ్యలు చేశారు.ఎవరినైనా చంపడానికి చేతులు లేకుండా, నడవడానికి కాళ్లు లేకుండా చేస్తానంటూ కారుమూరిని హెచ్చరించారు. ఁఆఖీ బాండ్ల స్కాంలో వందల కోట్లు అవినీతి చేసిన కారుమూరి నాగేశ్వరరావు త్వరలో జైలుకెళ్లడం ఖాయం అన్నారు. అయితే వర్మ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఇక కారుమూరి నాగేశ్వరరావు జైలుకి వెళ్లడం తప్పుదంటూ రకరకాల టాక్స్ పొలిటికల్ సర్కిల్స్ లో విన్పిస్తున్నాయి. నెక్ట్స్ లిస్టులో కారుమూరి పేరు ఉందంటూ ఇప్పుడు అంతా చర్చించుకుంటున్నారట.ఁఆఖీ బాండ్ల స్కాంలో వందల కోట్లు అవినీతికి కారుమూరి పాల్పడ్డారంటూ కేంద్ర మంత్రి వర్మ చేసిన కామెంట్లు ఇప్పుడు హాట్ టాపిగ్గా మారాయి. టీడీఆర్ బాండ్ల స్కాంలో అసలేం జరిగిందంటూ ఇప్పుడు అంతా ఆరా తీస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కారుమూరి..తన సొంత నియోజకవర్గమైన తణుకు పట్టణంలో అభివృద్ధి పేరుతో భారీ ఎత్తున సేకరించిన భూములపై ప్రస్తుత తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ ఆరా తీస్తున్నారంట.తణుకు మున్సిపాలిటీలో టీడీఆర్ బాండ్ల స్కాంపై ఇప్పటికే ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. వాస్తవానికి 2014 నుండి 19 వరకు అప్పటి తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ తణుకు పట్టణ అభివృద్ధి కోసం 6వేల గజాలకు బాండ్లు ఇచ్చారు. అయితే 2019 నుండి 24 వరకు అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావు ఏకంగా 6 లక్షల గజాల వరకూ బాండ్లు ఇవ్వడంతో తీగలాగితే డొంక కదిలింది అన్నట్లు రాష్ట్రంలోనే భారీగా టీడీఆర్ బాండ్స్ స్కాం బయటపడేందుకు కారణమైందట.ఈ స్కాంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొత్తం 754 కోట్ల రూపాయల విలువచేసే బాండ్లు జారీ చేస్తే అందులో దాదాపు 691 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇప్పటికే ఏసీబీ విచారణ పూర్తయిందని..త్వరలోనే నివేదికను ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉందట. అయితే ఏసీబీ నివేదికలో కారుమూరి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే ఆయన జైలుకెళ్లడం తప్పదనే చర్చ జరుగుతోంది. అయితే ఏసీబీ సమర్పించే నివేదికలో ఏముందనే దానిపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## భూ రిజిస్ట్రేషన్ల ఆదాయానికి గండి

-మొదటిపేజీ తరువాయి

ఆదాయ లక్ష్యాన్ని చేరుకోలేక పోయాయి.

**తగ్గిన డాక్యుమెంటు రిజిస్ట్రేషన్లు**

విజయనగరం జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో అన్ని రకాల డాక్యుమెంటు రిజిస్ట్రేషన్లు 75,494 వరకు జరగ్గా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 71,977 జరిగాయి. గత ఏడాదితో పోల్చిచూస్తే 3,517 వరకు రిజిస్ట్రేషన్లు తగ్గాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో 2023-24లో 18,462 డాక్యుమెంటు రిజిస్ట్రేషన్లు జరగ్గా 2024-25లో 18,202 వరకు జరిగాయి. ఇక్కడ గత ఏడాదితో పోలిస్తే 260 వరకు రిజిస్ట్రేషన్లు తగ్గాయి.

**మరింత మెరుగైన సేవలు**

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తీసుకురావడంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతున్నాయి. దీనిపై ప్రజల్లో స్పందన పెరుగుతుంది. కార్యాలయాల్లో రద్దీ తగ్గి రిజిస్ట్రేషన్ పనులు త్వరగా పూర్తవుతాయి. సిబ్బందిపై ఒత్తిడి, దళారుల ప్రభావం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం మరింత పెంపునకు కృషి చేస్తున్నాం.

# జూన్ 12 నాటికి 3 లక్షల గృహప్రవేశాలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి సర్కారు ఏర్పాటై.. మరికొన్ని రోజుల్లో ఏడాది పూర్తి కానుంది. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని రేంజులో ఘన విజయం అందుకుంది ఎన్డీఏ కూటమి. మొత్తం 175 స్థానాలకు గానూ.. 164 చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో తిరుగులేని మెజారిటీతో టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జూన్ 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్, మంత్రులుగా నారా లోకేష్ సహా కీలక నేతలు ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలో జరిగిన ఆ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరయ్యారు. అయితే ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి వచ్చే జూన్ 12తో ఏడాది పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం భారీ శుభవార్త వినిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఎన్డీఏ కూటమి సర్కారు ఏడాది పాలన పూర్తైన సందర్భంగా కొత్తగా నిర్మించిన 3 లక్షల ఇళ్లను ప్రారంభించి.. గృహప్రవేశాలు చేయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు జూన్ 12వ తేదీని ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. మూడు లక్షల మంది పేదలకు ఇళ్లను అందించి.. అదేరోజు వారితో గృహప్రవేశాలు చేయించేలా ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూన్ 12 వ తేదీ లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మూడు లక్షల ఇళ్లల్లో ఇప్పటి వరకూ 1.70 లక్షలు పూర్తికాగా.. మరో 60 వేల ఇళ్లు తుది దశలో ఉన్నాయి. గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేందుకు ప్రభుత్వం అదనపు సాయం కూడా అందిస్తున్న విషయం తెలిసిందే.బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు సాయం అందిస్తున్నారు. గడువులోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (హౌసింగ్) అజయ్ జైన్ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ప్రతిరోజూ జిల్లా కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిత్యం సమీక్షిస్తున్నారు. పనులను గడువులోగా పూర్తి చేసేలా సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

## మోదీ పర్యటనతో అమరావతి పనులు ఊపందుకుంటాయి

-మొదటిపేజీ తరువాయి

పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వేదికపై మోదీ గంటపాటు ఉంటారని చెప్పారు. గత ఐదేళ్లు రాజధాని రైతులను అప్పటి ప్రభుత్వం ఇబ్బందులు పెట్టిందని, అందువల్ల రైతులను కూడా గౌరవించుకోవాలని నాదెండ్ల మనోహర్ అన్నారు. గత ప్రభుత్వం రాజకీయ కక్షతో పోలవరాన్ని, అమరావతిని నిలిపివేసిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులు పునఃప్రారంభమయ్యాయని, అమరావతి పనులను కూడా తిరిగి ప్రారంభించేందుకు ప్రధాని ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. మే 2న రూ.లక్ష కోట్ల అభివృద్ధి పనులను మోదీ ప్రారంభిస్తారని అన్నారు.

## ఏపీ సిట్ అధికారుల అదుపులో రాజ్ కేసిరెడ్డి

**హైదరాబాద్ :** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రాజ్ కేసిరెడ్డిని ఏపీ సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం సిట్ విచారణకు హాజరయ్యేందుకు దుబాయ్ నుంచి హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఈ క్రమంలో రాజ్ కేసిరెడ్డిని ఏపీ సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం, విజయవాడకు తరలిస్తున్నారు.

**అంతకుముందు రాజ్ కేసిరెడ్డి ఆడియో విడుదల**

మంగళవారం సిట్ విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో రాజ్ కేసిరెడ్డి ఓ ఆడియోని విడుదల చేశారు. అందులో 'నేను రేపు(మంగళవారం) సిట్ విచారణకు హాజరవుతున్నాను. రేపు మధ్యాహ్నం 12:00 గంటలకు సిట్ ఆఫీసుకు వస్తానని సిట్ అధికారులకు సమాచారం ఇచ్చాను. నా ముందస్తు బెయిల్ అంశానికి సంబంధించి హైకోర్టులో వాదనలకు సమయం పట్టేలా ఉంది. కాబట్టి సిట్ విచారణకు హాజరవుతున్నాను' అని పేర్కొన్నారు.

**రెండురోజుల క్రితం విజయసాయి రెడ్డిపై**

రెండురోజుల క్రితం విజయసాయి రెడ్డిపై రాజ్ కేసిరెడ్డి ధ్వజమెత్తారు. విజయసాయి చెప్పే మాటలు నమ్మొద్దంటూ మీడియాకు రాజ్ కేసిరెడ్డి ఆడియో విడుదల చేశారు. త్వరలోనే విజయసాయి బండారం బయటపెడతానన్నారు. పోలీసుల విచారణకు సహకరిస్తానని తెలిపారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తి అయిన తర్వాత పోలీసులకు సహకరిస్తానని పేర్కొన్నారు. కొద్దిరోజులుగా తనపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. "సిట్ నోటీసులపై హైకోర్టును ఆశ్రయించా. మార్చిలో సిట్ అధికారులు మా ఇంటికి వచ్చారు. నేను లేనప్పుడు మా అమ్మకు నోటీసులు ఇచ్చారు. సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశా' అని గత ఆడియోలో పేర్కొన్నారు రాజ్ కేసిరెడ్డి.

## శంకర్ విలాస్ ఆర్వోబీ ఎట్టిపరిస్థితుల్లోనూ ఆగదు

**గుంటూరు:** కేంద్రం మద్దతుతో నెలల వ్యవధిలోనే శంకర్ విలాస్ ఆర్వోబీ అనుమతులు తీసుకొచ్చామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శంకర్ విలాస్ పైవంతెన కోసం భవనాలు, స్థలాలు కోల్పోతున్న వారికి పరిహారం పంపిణీ చేసి మాట్లాడారు. కొందరు కావాలని ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని పెమ్మసాని ఆరోపించారు. వంతెన నిర్మాణం ముందుకెళ్లకుండా చేయడమే కొందరి ఆలోచన అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఈ వంతెన ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని స్పష్టం చేశారు.

## 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి

-మొదటిపేజీ తరువాయి

సాగుతున్నాయన్నారు. కొత్తగా డయా ఫ్రమ్ వాల్ నిర్మాణ పనులను 990 కోట్లతో జనవరి 18న మొదలుపెట్టామని తెలిపారు. రెండు కట్టర్లు, రెండు గ్రాబర్లతో డయాఫ్రమ్ వాల్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి అన్నారు. ఏప్రిల్ 30 కల్లా మూడవ కట్టర్ కూడా అందుబాటులోకి రానుందన్నారు. వర్షాకాలంలో సైతం పనులు జరిగేలా, ఎగువ కాపర్ డ్యామును, బలోపేతం చేయడానికి బట్రస్ డ్యాం, మే నెలకల్లా పూర్తి చేస్తామని చెప్పారు. చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా, ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామన్నారు. డయాఫ్రం వాల్ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, సమాంతరంగా గ్యాప్%-%1 వద్ద, ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణాన్ని ఏప్రిల్ నెలలో మొదలుపెట్టామని మంత్రి తెలిపారు. గ్యాప్%-%2 వద్ద ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు ఈ ఏడాది నవంబర్%-%30 లోగా మొదలు పెట్టేలా, చంద్రబాబు ప్రణాళికలను అమలు చేస్తామని, వచ్చే 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా పనులు మరింత వేగవంతం చేస్తామన్నారు. చంద్రబాబు ఇటీవల జరిపిన రివ్యూలో 2027 లో గోదావరి పుష్కరాలు ఉన్నందున ఆ ఏడాది జూన్ కల్లా పూర్తయ్యేలా చూడాలని చెప్పారని, సాధ్యమైనంత వరకు అప్పట్లో గా పూర్తయ్యేందుకు పనులను వేగవంతం చేస్తామని లేనియెడల అనుకున్న లక్ష్యానికి కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. గత జగన్ ప్రభుత్వంలో లెఫ్ట్ కెనాల్ కు అర బస్తా సిమెంట్ గాని, రూపాయి పని నోచుకోలేదు అన్నారు. కుటమి ప్రభుత్వం 1200 కోట్లతో టెండర్లు పిలవడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గోదావరి వరద జలాలు లెఫ్ట్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు, తరలిస్తామని, తద్వారా ఉత్తరాంధ్రకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. ఈ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు.

## ఏపీలో స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు



**విజయవాడ :** రోడ్డుపై నడిచి వెళ్తున్నప్పుడూ లేదా వాహనాల్లో వెళ్తున్నప్పుడు రోడ్డుపక్కన వీధి వ్యాపారులను మనం గమనిస్తూనే ఉంటాం. తినుబండారాల దగ్గర నుంచి వస్తువుల వరకూ విక్రయిస్తూ ఉంటారు. పొట్టకూటి కోసం రహదారుల పక్కన, తోపుడు బండ్ల మీద చిరువ్యాపారులు.. తమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ ఉంటారు. కూటి కోసం కోటి కష్టాలు అన్నట్లుగా వారి ఇబ్బందులు వారివి. అయితే వీధి వ్యాపారుల కారణంగా అప్పడప్పుడూ రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతూ ఉంటుంది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ నేపథ్యంలో వారి జీవనోపాధి దెబ్బతీయకుండా.. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు అమలు చేస్తోంది.పట్టణాల్లో రద్దీ?ని నియంత్రించేందుకు, వీధి వ్యాపారులకు పరిశుభ్రమైన వ్యాపార పద్ధతులు అలవాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును తీసుకువచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ 2013లో ఈ స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును ప్రారంభించింది. స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు కింద వీధి వ్యాపారులకు కంటైనర్ షాపులు నిర్మించి ఇవ్వనున్నారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 200 కంటైనర్ షాపులు నిర్మించి వీధి వ్యాపారులకు అందించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నెల్లూరు మైపాడు రోడ్డులో పైలట్ ప్రాజెక్టుగా స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇప్పుడు శ్రీకాకుళంలోని కొత్తవంతెన రహదారిలోవీధి వ్యాపారులకు కంటైనర్లు నిర్మించి ఇవ్వనున్నారు.పట్టణాలు, నగరాల్లో రోడ్ల పక్కన ఆహార పదార్థాలు, వ్యాపారాలు చేసేవారికి స్మార్ట్ స్ట్రీట్ ప్రాజెక్టు కింద కంటైనర్లు కేటాయిస్తారు. 18 ఏళ్లు పైబడి ఉండాలి. అలాగే స్థానిక సంస్థలో వివరాలు నమోదు చేసుకుని ఉండాలి. అర్హులకు స్ట్రీట్ వెండర్స్ కమిటీ ద్వారా అందరి సమక్షంలోనే ఈ కంటైనర్ దుకాణాలు కేటాయిస్తారు. ఒకే రకమైన ఆహార పదార్థాలు, ఉత్పతులు విక్రయించేవారికి వీటిని కేటాయిస్తారు. ఈ కంటైనర్ దుకాణాలలో అవసరమైన అన్నిరకాల మౌలిక సదుపాయాలు, రూఫ్ టాప్ సీలింగ్, సోలార్ విద్యుత్తు, ఉచిత వైఫై, అధునాతన ఫర్నీచర్ ఉంటాయి. అలాగే ఆహార పదార్థాల తయారీ, మార్కెటింగ్‌పైనా ప్రత్యేక శిక్షణ అందిస్తారు.

# సంపాదకీయం

## మానవ మనుగడకు సవాలుగా మారిన కాలుష్యం

సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. పంచభూతాలలో ఒకటిగా, భారతీయ సంస్కృతిలో భూమి భూదేవతగా భావించబడి, పూజింప బడడం కనిపిస్తుంది. భూమి పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోయినా, కనీసం హాని కలిగించకుండా ఉంటేచాలు. ఇందుకోసం అవగాహన అవసరం. అటు పర్యావరణం, వాతావరణంతో పాటు ఇటు జీవన శైలిలోనూ మార్పులతో భూపరిరక్షణపై అవగాహనకోసం కూడా ప్రత్యేక కార్యక్రమా లు అవసరమవుతున్నాయి. ఈ క్రమంలోంచి వచ్చిందే 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం'. ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 22న 'ధరిత్రి దినోత్సవం' జరుపు కుంటున్నారు. ... 1962లో అమెరికన్ సెనెటర్ నెల్సన్‌కి వచ్చి న ఆలోచనకు ప్రతిరూపమే ఈ ధరిత్రీ దినోత్సవం. 1969లో నెల్సన్ మన వాతావరణంలో జరిగే మార్పులను వివరిస్తూ మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో మన వంతు ఏమి చెయ్యాలో అందరికీ తెలియ చెప్పడానికి ఒక రోజంటూ ఉంటే బాగుంటుందని అనుకున్నారు. వెంటనే తన ఆలోచనకు రూపకల్పన చేస్తూ తన మిత్రులకు మరియు ఒక వార్తాపత్రిక ద్వారా ప్రజలకూ ఈ ధరిత్రీ దినోత్సవం గూర్చి వివరించారు. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రీ దినోత్స వం జరిగింది. ఆరోజు ఆ దేశంలోని ప్రజలంతా ధరిత్రిని రక్షించు కునేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రమాణాలు చేసారు. ఇలా తొలుత అమెరికాలో ప్రారంభమైన ఈ ఉత్సవం ఆ తర్వాత ప్రపంచ వ్యాపితమైంది. వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయి. జీవం కోల్పోయిన నేలలో దిగుబడులూ నాసిగానే ఉంటాయి. దీర్ఘకాలంలో దిగుబడులు మరీ తగ్గిపోయి ఆహార సంక్షోభాలకు దారితీసే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఆలివర్ డి షట్టర్ గుర్తించారు. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాల వైపు మళ్లడం తప్ప మరో మార్గం లేదని నివేదించారు. వ్యవసాయంలో రసాయనాలు వాడే విధానాలను ప్రపంచవ్యాప్తం చేయడంలో కీలకపాత్ర వహించింది అమెరికా. ధరిత్రి దినోత్సవం పేరిట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కూడా అమెరికాలోనే ప్రారంభం కావడం విశేషం. 50 ఏళ్ల క్రితం ఏప్రిల్ 22న గేలార్డ్ నెల్సన్ నేతృత్వంలో కాలుష్యకారక విధానాలకు నిరసనగా జనం ఉవ్వెత్తున ఉద్యమించారు. అప్పటి నుంచి సుస్థిర అభివృద్ధి కోసం ధరిత్రి దినోత్సవం జరుపుకుం టున్నాం.ప్రపంచ వ్యాప్తంగా 175 కంటే ఎక్కువ దేశాల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అనాలోచిత మానవ చర్యల వల్ల కలుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న బృహత్తర లక్ష్యంతో ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా మనిషి చేస్తున్న పనుల వల్ల భూగోళం అ మితంగా వేడెక్కిపోతోంది. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వాడడం వల్ల వాయుకాలుష్యం పెచ్చు మీరుతోంది. పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతూ పదికాలాల పాటు పది లంగా చూసుకోవాల్సిన భూమిని నిస్సారంగా మార్చుతున్నాం. తరిగిపోయే వనరులకు బదులు, తరగని, పునర్వినియో గించుకోగల వనరుల ఆధారంగా జరిగే అభివృద్ధే సుస్థిర భివృద్ధి. ఇదే ధరిత్రికి సుస్థిర భవిష్యత్తును చేకూరుస్తుంది. భూమి, నీరు వంటి మౌలిక వనరులను గరిష్ట సామర్థ్యంతో వినియోగించాలి. వినియోగ అనుకూల సామర్థ్యాన్ని పెంచాలి. దూరదృష్టితో తరగని, పునర్వినియోగించు కోగల వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా సౌరశక్తి వినియోగం అధికంగా జరగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనీస స్థాయికి తగ్గించ గలగాలి. అడవుల సంరక్షణ, పెంపకం, సుస్థిర యాజమాన్య పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ జరగాలి. పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాలను తగ్గించటానికి వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలుష్య నివారణ చర్యలకై పలు చట్టాలను రూపొందించి అమలు జరుపు తున్నది. భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో "వాయుకాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1986వ సంవత్సరంలో "పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విషవాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణంలోకి వదలాలి. ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణురియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్లు, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది. మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజించింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగానూ, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపువర్గంగా వర్గీకరించింది. తెలంగాణాలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్నీ విడుదల చేయకుండా చూస్తూ, ఒక వేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఏదో చేయాలని మిన్నకుండి పోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి.

# కృత్రిమ మేధ అద్భుతమా, అనర్థమా?

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎఐ) అనే పదం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా చర్చింపబడుతూ విశ్వవ్యాప్త అంశంగా మారింది. ఫోన్‌ని ముఖగుర్తింపుతో అన్‌లాక్ చేసిన క్షణం నుండి ఇష్టమైన వివిధ రకాల స్ట్రీమింగ్ సర్వీసెస్‌పై వ్యక్తిగతమైన సిఫార్సులను చేసే వరకు కృత్రిమ మేధస్సు నిశ్శబ్దంగా తెరవెనుక పనిచేస్తుంది. ఇది మానవ మేధస్సును అనుకరించే, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కలిగిన సాంకేతిక వ్యవస్థ. కృత్రిమ మేధస్సు మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ప్రాక్టికల్ ఆటోమేషన్ వంటి వివిధ సాంకేతిక విభాగాలను కలిగి ఉంటుంది. కృత్రిమ మేధస్సు అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చింది. అయితే, మానవ ప్రగతికి దీని ప్రయోజనాలు చాలానే ఉన్నప్పటికీ, దీనిని దుర్వినియోగపరచడం వల్ల మానవ మనుగడకి చాలా అనర్థాలే ఉన్నాయనేది చాలామంది విశ్లేషకుల వాదన. అందుకే, కృత్రిమ మేధస్సు అద్భుతమా లేదా అనర్థమా అనే ప్రశ్నపై సమగ్రంగా చర్చించుకోవడం అవసరం. అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచాన్ని అబ్బురపరుస్తూ మానవ సమాజాన్ని శాసిస్తున్న కృత్రిమ మేధస్సు వివిధ రంగాలలో సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చి అనేక ప్రయోజనాలను సమాజానికి చేకూరుస్తుంది. ఎఐ ద్వారా పరిశ్రమల్లో మానవీయ జోక్యం లేకుండానే పనులు జరిగిపోతున్నాయి.తయారీ, లాజిస్టిక్స్, డేటా ఎనలిసిస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ వేగాన్ని పెంచుతోంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాల్లో చిప్ డిజైన్, ప్రోగ్రామింగ్ సిస్టమ్స్‌ను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది. ఎఐ ఆధారిత రోగ నిర్ధారణ వ్యవస్థలు (ఎఐ డయాగ్నోస్టిక్స్) అధిక నాణ్యతతో, తక్కువ సమయంలో వ్యాధులను గుర్తిస్తున్నాయి. కృత్రిమ అవయవాలు (ఆర్టిఫిషియల్ ఆర్గాన్స్) అభివృద్ధి అవుతున్నాయి. స్మార్ట్ వైద్యసహాయ సిస్టమ్స్, రోబోటిక్ సర్జరీలు, ఎఐ -ఆధారిత డ్రగ్ డిస్కవరీ వల్ల చికిత్స మరింత ప్రభావవంతంగా మారింది. ఎఐ ఆధారిత వ్యక్తిగతీకరించిన విద్యా విధానాలు (పెర్సనలైజ్డ్ లెర్నింగ్) విద్యార్థుల విద్యను మెరుగుపరుస్తున్నాయి. బహుభాషా అనువాద సాధనాలు (లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్ టూల్స్) విద్యను అందరికీ సులభతరం చేస్తున్నాయి. వర్చువల్ టీచర్లు, చాట్‌బాట్ లెర్నింగ్ అసిస్టెంట్లు విద్యార్థులకు సహాయంగా ఉంటున్నాయి. ఎఐ ఆధారిత మార్కెట్ విశ్లేషణలు వ్యాపార నిర్ణయాలను మెరుగుపరుస్తున్నాయి. ఫ్రాడ్ డిటెక్షన్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో మోసాలను తగ్గిస్తోంది. కస్టమర్ సపోర్ట్‌లో చాట్‌బాట్లు, వాయిస్ అసిస్టెంట్లు మెరుగైన సేవలను అందిస్తున్నాయి. ఎఐ ఆధారిత స్వయంచాలక వాహనాలు (అటానమస్ వెహికల్స్) రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తున్నాయి. డెలివరీ డ్రోన్లు, ఆటోమేటెడ్ లాజిస్టిక్స్ ద్వారా సరుకు రవాణా వేగవంతంగా మారింది. స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గుతున్నాయి. రహదారి భద్రత పెంపు తదితర రంగాల్లో ఎఐ సహకరిస్తోంది. గేమింగ్, కంటెంట్ సజెస్టషన్ సిస్టమ్స్ వంటి




వేదికల్లో ఎఐ వినియోగం విపరీతంగా పెరిగింది. ప్రస్తుత సమయంలో అత్యంత ఆధునిక సాంకేతిక విలువలతో, వ్యయంతో నిర్మిస్తున్న భారీ సినిమాలలో కృత్రిమ మేధస్సును విరివిగా వాడుతున్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో కృత్రిమ మేధస్సు అనేది ఒక కీలకమైన సాంకేతిక పరిజ్ఞానంగా మారింది. ఇది మన దైనందిన జీవితాన్ని సులభతరం చేయడంలో, పరిశ్రమల వృద్ధిలో, ఆరోగ్య సంరక్షణ, విద్య, రవాణా మొదలైన అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. అయితే, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ సాంకేతికతను దుర్వినియోగం చేయడం వలన కొన్ని అనర్థాలను కూడా మానవ సమాజం ఎదుర్కొనవలసి వస్తుంది. ఎఐ వల్ల మానవులకు పని అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఆటోమేషన్ వల్ల అనేక ఉద్యోగాలు క్రమంగా అంతరించిపోతున్నాయి. ముఖ్యంగా కస్టమర్ సపోర్ట్, మాన్యుఫ్యాక్చరింగ్, డ్రైవింగ్ రంగాల్లో పని చేస్తున్నవారికి ఇది ముప్పుగా మారింది. ఎఐ ఆధారిత సర్వైలెన్స్ సిస్టమ్స్ వ్యక్తిగత గోప్యతను ప్రమాదంలో పడేస్తున్నాయి. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా తప్పుడు వీడియోలు, ఫేక్ న్యూస్ సృష్టించడం సాధ్యమవుతోంది. హ్యాకింగ్, సైబర్ మోసాలకు ఎఐ వాడబడే అవకాశముంది. ఎఐ అనేక రంగాల్లో పూర్తిగా ఆధిపత్యం చెలాయిస్తే, మానవ నియంత్రణ తగ్గిపోతుంది. ఎఐ ఆధారిత ఆయుధ వ్యవస్థలు (అటానమస్ వెపన్స్) భవిష్యత్తులో మానవాళికి ముప్పుగా మారవచ్చు. ఎఐ తీసుకునే నిర్ణయాలు ఎల్లప్పుడూ నైతికంగా సరైనవిగా ఉండవు. ఎఐ డేటాను తప్పుగా ఉపయోగించుకుంటే, అన్యాయ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఎఐ ఆధారిత నియామక ప్రక్రియల్లో (హై రింగ్ సిస్టమ్స్) వివక్షత కనిపించవచ్చు. మనుషులు ప్రతి చిన్న విషయానికి కృత్రిమ మేధస్సుపై ఆధారపడుతూ ఉంటే తమ ఆలోచన శక్తిని క్రమక్రమంగా కోల్పోతారు. తద్వారా మనుషుల్లోని అద్భుతమైన సృజనాత్మక శక్తి క్రమక్రమంగా అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఎఐ ఆధారిత రోబోట్లు, వర్చువల్ అసిస్టెంట్స్ వల్ల మానవ సంబంధాలు దెబ్బతిని మనిషి ఒంటరిగా మిగిలిపోయి తీవ్రమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఎఐ ఆధారిత ఆయుధ వ్యవస్థలు, మోసపూరిత టెక్నాలజీ మానవ సమాజానికి ముప్పుగా మారవచ్చు. కృత్రిమ మేధస్సు అనేది మనిషి సృజించిన ఒక గొప్ప సాంకేతిక అద్భుతం. కృత్రిమ మేధస్సు అద్భుతమా లేదా అనర్థమా అనేది దాని ఉపయోగం, ప్రయోజనాలు, పరిమితులను మనం ఎలా నిర్వహిస్తామనే దానిపై ఆధారపడి ఉంటుంది. దీనిని సరైన మార్గంలో ఉపయోగించుకుంటే, మానవుని జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అద్భుత సాధనంగా మారుతుంది. కానీ, ఈ ఏఐని ఉపయోగించడంలో నిర్దిష్టమైన నియంత్రణ లేకపోయినా, నైతిక మార్గదర్శక సూత్రాలను పాటించకపోయినా, చట్టపరమైన వ్యవస్థల ఆధీనంలో లేకపోయినా, సాంకేతిక అద్భుతంగా కొనియాడబడుతున్న ఈ కృత్రిమ మేధస్సు మా నవ సమాజానికి ప్రమాదకరమైన అనర్థంగా మారే అవకాశం పుష్కలంగా ఉంది. అందువల్ల, ఈ సాంకేతిక అద్భుతాన్ని అభివృద్ధి పరిచే దశలోనే సరైన నైతిక మార్గదర్శకాలను అనుసరించేలా, మానవ నియంత్రణ విధానాలను పాటించేలా, చట్టాల పరిమితులకు లోబడి పని చేసేలా దాని సాంకేతిక వ్యవస్థను సృజించాలి. సరైన నిబంధనలను, నైతిక మార్గదర్శక సూత్రాలను, మానవత్వ విలువలను, చట్టపరమైన పరిమితులను పాటిస్తే కృత్రిమ మేధస్సు నిజంగా ఓ అద్భుతమే. పాటించకపోతే సమాజానికి ఓ అనర్థమే.

# త్రిశంకు స్వర్గంలో ఇంటర్ విద్య

పదవ తరగతి పరీక్షలు అవగానే ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రతినిధులు, మరో మాటలో చెప్పాలంటే ఏజెంట్లు తల్లిదండ్రుల వెంటపడి అడ్మిషన్ల తంతు పూర్తి చేసుకుంటున్నారు. కొన్ని కళాశాలలైతే వేసవి సెలవుల నిబంధనలు తుంగలో తొక్కి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నిరోధించాలసిన విద్యాశాఖ ఓ పత్రికా ప్రకటన జారీ చేసి కళ్ళు మూసుకుంటుంది. అటు ఉన్నత విద్య డిగ్రీకి, ఇటు ప్రాథమిక విద్యకు మధ్య ఇంటర్మీడియట్ విద్య అత్యంత కీలకమైన పునాది అంశం కావడంతో తల్లిదండ్రులు కాస్తా ఇంటర్‌పై ఆసక్తి చూపిస్తూ ఉంటారు. కనుక దానిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు కళాశాలలు యాజమాన్యం ఇంటర్ విద్య ను కీలకమైన వ్యాపారంగా స్వీకరించింది. ఒకప్పుడు ఇంటర్మీడియట్ విద్యకు ప్రభుత్వ కళాశాలలే కీలక అంశంగా ఉండేవి. ప్రభుత్వ కళాశాలల్లోనే చదువుతూ ఎంసెట్ కోచింగ్ కు సబ్జెక్టులవారీగా బయట తీసుకునేవారు. ప్రైవేటు కళాశాలలు కుప్పలుతెప్పలుగా వెలిసిన తర్వాత బోధన, కోచింగ్ ఒకే చోట లభించడంతో ప్రైవేటు కళాశాలల వైపు విద్యార్థులు మరలుతున్నారు. కీలకమైన గణితం, సైన్స్ ప్రాధాన్యత ఉన్న ఇంటర్ గ్రూపుల కోసం ప్రైవేటు కళాశాలలు, కార్పొరేట్ కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. ఇక ఫీజులు కట్టలేని పేదలు మాత్రమే అరకొర ప్రభుత్వ కళాశాలలో చేరి కామర్స్, ఆర్ట్ లాంటి హెచ్ఈసి, సిఇసి లాంటి గ్రూపుల్లో చేరుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 6వ తరగతి నుండి ఇంటర్ వరకు ఉన్న గురుకుల పాఠశాలలు 500 వరకు ఉండగా, కేవలం ఇంటర్మీడియట్ బోధిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 469 మాత్రమే ఉన్నాయి. ఇక ప్రైవేటు రంగంలో ఇంటర్మీడియట్ బోధించే కళాశాలల సంఖ్య 1385 ఉన్నాయి. అంటే ప్రైవేటు రంగంలోనే జూనియర్ కళాశాలలు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఇక కార్పొరేట్ కళాశాలలు అయితే ఒక్కో పట్టణం లో పది జూనియర్ కళాశాలలు బ్రాంచీలు పెట్టి నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేవలం ఇంటర్మీడియట్ మాత్రమే బోధిస్తారు. ఇంటర్మీడియట్ బోధించే లెక్చరర్లు పిజి టీచర్లు ప్రభుత్వ రంగంలో 6,992 మంది ఉన్నారు. ఇంత మంది లెక్చరర్స్ ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు నానాటికీ తీసికట్టు నాగంబొట్టు అనే సామెత గా మారింది. జూనియర్ కళాశాల వ్యవస్థ పతనంలో చాలా కారణాలు ఉన్నాయి. ఇక్కడ బోధించే ఉపాధ్యాయులు తమ క్యాచ్‌మెంట్ ఏరియాలోని విద్యార్థులను తమ కళాశాలలో చేరమని కనీసం అడగరు. జూనియర్ కళాశాల్లలో సరైన మానిటరింగ్ ప్రక్రియ ఉండడం లేదు. జూనియర్ లెక్చరర్ల నియామకంలో కూడా పిజి అరకొర పూర్తి చేసిన బోధనేతర సిబ్బందిని ప్రమోషన్లపై లెక్చరర్లుగా



నియమించడం కూడా ఒక రకంగా విద్యా ప్రమాణాల తరుగుదలకు కారణం అవుతున్నది. ఇప్పుడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధించే లెక్చరర్లు అన్ని సబ్జెక్టులకు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య మాత్రం అందుకునుగుణంగా లేదు. నూతన విద్యా విధానం 2020 ప్రకారం, విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం 2ం3ం3ం4 ప్యాటర్న్ ప్రకారం 9, 10 తరగతుల్లో ఇంటర్ విద్యను పాఠశాలలోనే నిర్వహించవలసి ఉంది. కానీ, చట్టం వచ్చి 15 ఏళ్ళు అయినా ఆ ప్యాటర్న్ అమలు జరపడంలో ఇంకా ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇంటర్ కళాశాలల్లో బోధించే జూనియర్ లెక్చరర్స్ కూడా ఇంటర్మీడియట్ విద్యను పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇంటర్ విద్య పాఠశాలలో కొనసాగించడం వలన ప్రైవేటు కళాశాల వ్యవస్థ కొంతలో కొంతైనా దెబ్బ తింటుంది. సామాన్య ప్రజలకు ఇంటర్మీడియట్ చదువులో ఫీజులు భారం కూడా తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వాలు ఎంతసేపు ఉన్న వ్యవస్థలను డొల్లపుచుకుపోయే ధోరణి తప్ప నూతన మార్పులు స్వీకరించే పరిస్థితి లేదు? ఇంకా ప్రైవేటు జూనియర్ కళాశాలలు, కార్పొరేట్ కళాశాలలు ఫీజులదందా మామూలు గా లేదు. ఒక్క 'డే' స్కాలర్‌కే లక్ష రూపాయలు ఫీజు వసూలు చేస్తున్నారు. ఇక రెసిడెన్షియల్ కళాశాలలోనైతే రెండు లక్షల నుండి మూడు లక్షలు దండుకుంటున్నారు. మొదట విద్యార్థుల చేర్చుకుని వరకు సౌమ్యంగా కనిపించిన యాజమాన్యం ఫీజులు వసూలు సమయానికి కఠినంగా మారుతున్నారు. సామాన్యుల ఆర్థిక స్థితిగతులు కూడా ఎంతమాత్రం పరిగణలోనికి తీసుకోకుండా వేధింపులకు గురిచేస్తారు. పిల్లలను కూడా మానసికంగా, భౌతికంగా చేసే వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. ప్రైవేటు కళాశాలలు ఎక్కువ మంది ఎంఎల్ఏలు, ఎంఎల్‌సిలు నడపడం వలన పరోక్షంగా ప్రభుత్వం మద్దతు కూడా వీరికి అన్యోపదేశంగా లభిస్తుంది. ఇకపోతే ఇప్పటికే ఇంటర్మీడియట్ అనుబంధంగా ఉన్న గురుకుల పాఠశాల అనుభవాలు తీసుకొని కొన్ని పాఠశాలల్లోనైనా ఇంటర్ అందుబాటులోకి వస్తే బాలికల డ్రాప్‌అవుట్స్, బాల్యవివాహాలు సంఖ్య కొంత వరకు తగ్గే అవకాశం ఉంది. ఇక పాఠశాల ఇంటర్ విద్యలో పాలిటెక్నిక్ విద్యను విలీనం చేయాల్సిన అవసరం ఉంది. లేబరేటరీ టెక్నీషియన్, నర్స్ శిక్షణ, పారిశ్రామిక శిక్షణ, కంప్యూటర్ విద్య, కృత్రిమ మేధ, ఫ్యాషన్ డిజైన్, అగ్రికల్చర్, సెరికల్చర్, హార్టికల్చర్ లాంటి వృత్తి విద్యా కోర్సులు చేర్చడం వలన బడుగుబలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం జరగడంతోపాటు ప్రభుత్వ పాఠశాల జూనియర్ కళాశాలలకు ప్రాణప్రతిష్ట చేసినట్లు అవుతుంది. ఈ దశలో ఎంసెట్ లాంటి శిక్షణతో పాటు, లైంగిక విద్య, నైతిక విద్య సైతం బోధించడం ఇంటర్మీడియట్ స్థాయిలో సామాజిక అవసరంగా భావించాల్సి ఉంటుంది. అంతేకాక, ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థుల మాతృభాషను లాంగ్వేజ్‌గా తప్పనిసరిగా చేయాల్సిన అవసరం కూడా ఉంది. ప్రైవేటు కళాశాలలు వేసవి సెలవులలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు, సంస్కృతం లాంటి లాంగ్వేజ్ సిలబస్ పూర్తి చేసుకొని ఇంకా సమయమంతా గణితం, సైన్స్ బోధనపై దృష్టి పెట్టడం వలన ప్రవేశ పరీక్షలలో రాణిస్తున్నారు. ఒత్తిడి లేని, స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్య ఒక్క ప్రభుత్వ రంగంలోనే లభిస్తుంది. కనుక కీలకమైన ఇంటర్మీడియట్ విద్యలో విద్యార్థిని తమ భవిష్యత్ లక్ష్యాల వైపు మళ్ళించే శాస్త్రీయ విద్య తప్పనిసరిగా అవసరం అవుతుంది. తాము ఇంటర్మీడియట్ స్థాయిలో నేర్చుకునే విద్య జీవితానుభవంలో ఉపయోగపడేది. తమ ఉపాధి అవకాశాలు కల్పించేదిగా, కనీసం పెంచేదిగా ఉండాలి. ఆ దిశగా ప్రభుత్వ ఆలోచనలు ఉండాలని, ఇంటర్ విద్యలో గౌరవప్రదమైన సంస్కరణలు రావాలని కోరుకుందాం. ఇంటర్ చదువుత్రిశంకు స్వర్గంగా కాకుండా విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే సంపూర్ణ అనుభవాలు, నైపుణ్యాలు నేర్పేదిగా, తీర్చిదిద్దేది గా ఆ మార్పులు ఉండాలని కోరుకుందాం

# దగాకోరు పాలన చేయకండి!

## కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి




గత సంవత్సరం బకాయిలను తక్షణం చెల్లించాలిని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద ఉదయం ధర్నా జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జే వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు జి ఆదినారాయణ, ఎం యేసు, రాగుల రఘువులు, జి బాలరాజు, ఐఎఫ్టియు నాయకులు, జి రాజ్ కుమార్, బొడ్డు సత్యనారాయణ మూర్తి, జీ దుర్గారావు, గ్యాస్ యూనియన్ నాయకులు చిన్న, శ్రీను, కె.వి. రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా కార్యదర్శి జే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2024 సంవత్సరం ఎన్నికలలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు 59 విభాగాలుగా 176 హామీలు ఇచ్చిందని, వాటిలో ఒక పెన్షన్, అరకొర గ్యాస్ పథకం తప్ప మరి ఏమి అమలు చేయలేదని విమర్శించారు. విద్యార్థులకు, యువజనులకు, నిరుద్యోగులకు, మహిళలకు, కార్మికులకు, వివిధ వృత్తులు, కులాల వారీగా అమలు చేస్తామన్న పథకాలు ఏవీ కూడా అమలు చేయలేదని "కుడినదగా, ఎడమ దగా, కుడి ఎడమల దగా దగా"అన్న చందంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉందని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, మైనారిటీ వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు "డూడు బసవన్నలా"చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తల ఊపుతూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని విమర్శించారు. రెండున్నర లక్షల పెన్షన్లు కోత విధించి, పెన్షన్ పెంచి అమలు చేస్తున్నట్టు ఈ ప్రభుత్వం ఫోజు కొడుతుంది తప్ప ఆచరణలో పెన్షన్లు పెరిగింది లేదని విమర్శించారు. మొదటి దఫా గ్యాస్ పథకం అరకొరా అమలు చేశారు తప్ప, పూర్తిగా అమలు చేయలేదని, ఉచిత బస్సు ఊసే లేదని, నిరుద్యోగ భృతి మాటే లేదని, అమ్మకు వందనం, మహిళా శక్తి, రైతు భరోసా, వాలంటీర్లకు 10,000/-జీతం ఇవి కూడా అమలు చేయలేదని, డీఎస్సీ నోటిఫికేషన్ గానీ, జాబ్ క్యాలెండర్ గాని విడుదల చేయలేదని విమర్శించారు. ఇల్లు లేని వారికి గ్రామాల్లో మూడు సెంట్లు భూమి, పట్టణాల్లో రెండు సెంట్లు భూమి ఇస్తానన్న పథకానికి నేటికికీ శ్రీకారం చుట్టలేదని విమర్శించారు. ఉపాధి హామీ కూలీలకు నిధులు విడుదల కాలేదని, గ్రామపంచాయతీలలో పారిశుధ్య కార్మికులకు స మాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, మున్సిపాలిటీలో ఇచ్చిన విధంగా ద్వారా 21 వేల జీతం ట్రెజరీ ద్వారా చెల్లించాలని, పంచాయతీ కార్మికులకు సబ్బులు, నూనెలు, యూనిఫామ్, రైన్ కోట్, జోళ్ళు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# వైసిపి హయాంలో మఠం భూములు స్వాహా

## "పేదలందరికీ ఇళ్లు"పథకంలో దారి మళ్లిన 40 కోట్లు





**ఏప్రిల్ 21,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరుల కబంధహస్తాలలో చిక్కుకున్న మఠం భూములను కాపాడాలని అలాగే నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో 40 కోట్ల రూపాయల భారీ కుంభకోణం జరిగిందని తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన పీజీ ఆర్ఎస్ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలం పరిధిలోని హదీ రాంజీ మఠానికి వేలాది ఎకరాలను పలువురు భక్తులు విరాళంగా అందించారు అని అన్నారు. ఆ భూములు చాలా సంవత్సరాల వరకు పదిలంగా ఉన్నాయి అని తెలిపారు. కానీ వైసిపి కబ్జా కన్ను ఆ భూములపై పడడంతో 2019 నుండి 2024 వరకు తిరుపతి గ్రామీణ మండలం పరిధిలోని దామినీడు నుంచి సి. మల్లవడం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మఠం భూములు, వంక పోరంబోకు, చెరువులు, వాగులు, ప్రభుత్వ భూములను అలాగే వేదాంతిపురం అవిలాల రెవెన్యూ పరిధిలో ఉన్న హథీరాంజీ మఠం భూములను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అండదండలతో అనుచరులు, బినామీలు ఆక్రమించుకున్నారు అని ఆరోపించారు.పాత రికార్డుల ప్రకారం మఠం భూములు సుమారు 2000 ఎకరాల ఉండేవి అని అన్నారు .అయితే వాటిలో సగానికి పైగా భూములు వేదాంతపురం, అవిలాల రెవెన్యూ సర్వే హద్దుల్లోని హరిరాంజీ మఠానికి చెందిన ఇనాం భూములు, మరికొన్ని మఠాలకు సంబందించిన భూములు, వంకలు, పోరంబోకులు, చెరువులు ఎక్కడపడితే అక్కడ అక్రమంగా ఆక్రమణకు గురయ్యాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారుల నుండి మఠం భూములను కాపాడడానికి కలెక్టర్ వారు వీటిపై ప్రత్యేక చొరవ చూపి ప్రస్తుతం ఆక్రమణలో ఉన్న భూములను, అక్రమ కబ్జాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపేందుకు మఠం భూములను పరిరక్షించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా తొండవాడ, దోర్నకంబాల, ఎం.పీ కొత్తపల్లిలో భూ సేకరణ పరిహారాన్ని అసలైన రైతులకు ఇవ్వకుండా వైసిపి వారు అడ్డదారిలో దోచుకున్నారని ఆరోపించారు. భూ పరిహారం చెల్లింపులో దాదాపుగా 40 కోట్ల రూపాయలు భారీ కుంభకోణం జరిగిందని వీటిపై సైతం విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి టిడిపి అధ్యక్షులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు,రాష్ట్ర టిఎన్టియుసి కార్యనిర్వాహణ కార్యదర్శి అమ్మినేని మధు, చంద్రగిరి నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు శ్రీధర్ నాయుడు, తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కిషోర్ రెడ్డి, తిరుచానూరు టిడిపి కార్యదర్శి సాయి రాయల్, తెలుగు యువత హరే రామ్ రెడ్డి, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డా. ధృవ రామారావు గొల్లుకు జ్యోతిష్య వాస్తు చక్రవర్తి అవార్డ్‌తో ఘనసన్మానం.





**శృంగవరపుకోట, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** శృంగవరపుకోట., పట్టణానికి చెందిన డా. ధృవ రామారావు గొల్లు మహా మాయ ఇండస్ట్రీ లొ ఇంజనీర్ గా ఉద్యోగం నీర్వహిస్తు జ్యోతిష్య వాస్తు శాస్త్రం లలొ తనకంటూ ఒక గొప్ప గుర్తింపుని ఏర్పరచుకుని ఉబయతెలుగు రాష్ట్రములలోనే కాక యావత్ దేశంలో ఎన్నో బిరుదులు సత్కారంలు పొందిన కారణంగా తన ఈ ప్రత్యేకమైన గుర్తింపునకు ఆదివారం న ఆంధ్రప్రదేశ్ సింహాచలం దేవస్థానము నందు జ్యోతిష్యుల సెమినార్ వేడుకగా, %చీూ% ఆస్ట్రాలజీ ఆర్యన్ ఆస్ట్రాలజీ రీసెర్చ్ సంస్థ వారు నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖులు సంస్థ అదేనేత శ్రీ నరసింహ రావు, పి. వి. నారాయణ రావు, ప్రధాన అర్చకులు మరియు డిప్యూటీ ఈవో నారాయణ చేతులమీదుగా ధృవ రామారావుని జ్యోతిష్య వాస్తు చక్రవర్తి బిరుదుతొ ఘనంగా సన్మానించినారు. గౌరవసభలో సన్మానం స్వీకరించిన డా. ధృవ రామారావు గొల్లు క్రితంలొ జ్యోతిష్య వాస్తు విభాగంలో గత ఏడ్షాది ఏప్రిల్ నెలలో15 వ తేదీన ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ లొ పేర్మినెంట్ మెంబర్షిప్ డాక్టరేట్స్ పొందివున్నపటికి అక్కడితో ఉపశమించక మరింత శ్రమిస్తూ భవిష్యత్ జ్యోతిష్య వాస్తు శాస్త్రంలందు నూతన పద్ధతులు ద్వారా ప్రజలకు మరింత సహాయ సహకారాలు మరియు వారి సమస్యలకు తగు పరిస్కారములు అందించుటకు ఎల్లప్పుడూ శ్రమిస్తానని వెల్లడించారు. తన ఈ విజయం పట్ల, కుటుంబ సభ్యులు, పట్టణములోని శ్రీనివాసా కాలనీ బాల్యమిత్రులు, తోటిస్నేహితులు మరియు సహ ఉద్యగులు అభినందనలు తెలియజేసారు. సత్కారం స్వీకరించిన సందర్భంగా అవార్డు గ్రహీత డా. ధృవ రామారావు మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా జ్యోతిష్య, వాస్తుశాస్త్రంలొ ప్రజలకి సేవ చేస్తూ వాళ్ళ సమస్యలుకు పరిస్కారములు తెలియజేయడం వలన వారు పొందిన ఆనందం మరియు వారి ఆశీర్వాద బలం వలన వర్తమానంలో నేను అందుకుంటున్న ఈ అవార్డులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అవరోధించాలని ఆశ్షాభావం వ్యక్తం చేశారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎప్సెట్ - ఎంపిసి/బైపిసి స్ట్రీమ్ లలో ఆన్లైన్




**ఏప్రిల్ 21,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 22,23 తేదీలలో ఆఫ్లైన్ లో నీట్ ను, ఆన్లైన్ లో ఈప్ సెట్ ను ఏప్రిల్ 26,27,28 తేదీలలో ఉంటుందని అని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. సోమవారం రోజున జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఎస్ఎఫ్ఐ మోడల్ ,నీట్ పోస్టర్స్ ను విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలపై పోరాటంతో పాటు చదువులోనూ విద్యార్థులను చైతన్యం చేయడానికి నిరంతరం పాటుపడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, జిల్లా కార్యదర్శి భగత్ రవి తెలిపారు. ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ విద్యావేత్తల చేతుల మీదుగా తయారు చేసినటువంటి మోడల్ టెస్ట్ పేపర్లను రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ద్వారా రాయించడం జరుగుతుందని వారు అన్నారు. భవిష్యత్తులో జరగబోయే ఈప్ సెట్, నీట్ లలో మంచి స్కోరు తెచ్చుకోవడానికి చాలా ఉపయోగపడుతుందని ఈ టెస్టుల ద్వారా విద్యార్థులు ఆన్లైన్లో ప్రాక్టీస్ చేసుకోవడానికి మంచి అవకాశం అని విద్యార్థులు అందరూ ఉపయోగించుకోవాలని వారు కోరారు. ఏప్రిల్ 22 23 తేదీల్లో ఆఫ్లైన్లో నీట్ ను, అదేవిధంగా ఏప్రిల్ 26 27 28 తేదీలలో ఆన్లైన్ లో ఈప్ సెట్ ను కరకంబాడి రోడ్ లో ఉన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కాలేజ్ లో కంప్యూటర్స్ ద్వారా ఆన్లైన్లో నిర్వహించడం జరుగుతుందని వారు అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ క్రింది నెంబర్లను సంప్రదించాల్సిందిగా వారు తెలిపారు. 6281392799/8179492515 . ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, నాయకులు రెడ్డి కుమార్, శివ పాల్గొనారు.

## కోరమండల్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం




**కాకినాడ జిల్లా:ఏప్రిల్ 21 :** రమణయ్యపేట మార్కెట్ వద్ద గల కనకదుర్గ అమ్మవారి గుడి వద్ద కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఆ సంస్థ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి దప్పిక తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. రోడ్ల వెంబడి రాకపోకలు సాగించే బాటసారులకు దాహార్తిని తీరుస్తాయని అన్నారు. ఈ మజ్జిగ చలివేంద్రాన్ని జూన్ నెల వరకు కొనసాగిస్తామని వెంకట దుర్గావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మల్లీశ్వరి, కోశాధికారి శ్రీదేవి, మోహిని కుమారి, మాధవి ,పద్మమోహన్, త్రివేణి, పద్మావతి, రత్నం, దీపిక, సృజన తదితరులు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణ ఆపండి : రైతుల డిమాండ్



**ఏప్రిల్ 21 (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** బలవంతపు భూసేకరణను ఆపాలని తిరుపతి జిల్లా, సత్యవేడు మండలంలో ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటి పాకం, రాళ్లకుప్పం గ్రామం లోని రైతులు కోరారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్లో జరిగిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో సత్యవేడు మండలానికి చెందిన రైతులు ఏపీఐఐసి కి భూములను ఇవ్వడానికి సిద్ధంగా లేమని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ. తిరుపతి జిల్లా, సత్యవేడు మండలంలో ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటి పాకం, రాళ్లకుప్పం గ్రామములలో 2583.99 ఎకరములు శ్రీ సిటీకి కేటాయించుటకు, ఏపీఐఐసీకి అనుకూలంగా ఇచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు.భూములు ఇవ్వడానికి ఎవ్వరూ సిద్ధంగా లేమని రైతుల అభిప్రాయములు తెలుసుకోకుండా శ్రీ సిటీ ఇచ్చిన ఒక్క అప్లికేషన్ కు నాలుగు గ్రామముల రైతుల భూములు తీసి ఇవ్వటానికి ఇచ్చిన జీవో పూర్తిగా రైతులకు వ్యతిరేకమని ఆగ్రహించారు... ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సత్యవేడు మండలం రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాపిడ్ సర్వేలో పాల్గొన్న పశు వైద్య సిబ్బంది..



**పాతపట్నం ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి న్యూస్..** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పశు సంవర్ధక శాఖ ద్వారా ఈనెల 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న రాపిడ్ సర్వే వలన పాడి రైతుకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకర్ రావు అభిప్రాయపడ్డారు. ఈ ఐదు రోజుల్లో పాతపట్నం మండలంలో ఏడుగురు ఎన్యూమరేటరులు114 మంది రైతులతో, మెలియాపుట్టి మండలంలో ఆరుగురు ఎన్యూమరేటరులు 136 మంది రైతులతో సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వేలో ప్రధానంగా ఆవుల పెంపకం, గొర్రెల పెంపకం, మేకల పెంపకం మరియు కోళ్ల పెంపకం చేపడుతున్న రైతులను సర్వే చేస్తారు .ఈ సర్వేలో రైతు అనుసరిస్తున్న విధానాలు ,ప్రభుత్వం నుండి కావలసిన సదుపాయాలు మొదలు విషయాల గురించి సర్వే చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సర్వే వలన ప్రభుత్వం ఎటువంటి పథకాలు పశు సంవర్ధక శాఖలో అమలుపరచాలో మరియు పాడి రైతుకు, గొర్రెల, మేకల పెంపకం దారులకు, కోళ్ల పెంపకం దారులకు ఎటువంటి సదుపాయాలు భవిష్యత్తులో కల్పించాలో అవగాహన కలుగుతుందని చెప్పారు .ఈ సర్వేలో పశు వైద్య సిబ్బంది గుణాలమ్మ, కుమారి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ వద్ద ఆకస్మిక వాహన తనిఖీలు





**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** రాత్రి 11 గంటల తరువాత పట్టణంలో ఆకతాయిగా తిరుగుతున్న యువతకు కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్ ఆదేశాలతో ఏప్రిల్ 20న రాత్రి 10 నుండి 12 గంటల వరకు రైల్వే స్టేషన్ వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారని వన్ టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో నేర నియంత్రణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో విజయనగరం పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద రాత్రి 10 గంటల నుండి 12 గంటల వరకు పోలీసుల ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 178 వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 4 కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 2 కేసులు, రాత్రి 11 గంటలు తరువాత సహేతుకమైన కారణం లేకుండా సంచరిస్తున్న యువతకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం, రైల్వే స్టేషన్ లోని ప్లాట్ ఫామ్లు సందర్శించి, ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, ప్రయాణికుల బ్యాగులను తనిఖీలు చేశారని వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ముగ్గురు ఎస్సై లు, %హుళీ%, వన్ టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డుకు 'చేయూత' అందజేత..

## విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్.



**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డుకు 'చేయూత' గా రూ.3,24,470/-ల చెక్ ను అందజేసిన జిల్లా ఎస్పీ. హెూంగార్డ్స్ సంక్షేమానికి కృషి చేస్తామన్న జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్. విజయనగరం జిల్లా పోలీసుశాఖలో హెూంగార్డుగా పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన హెూంగార్డు కాజా రామారావుకు "చేయూత"ను అందించేందుకు హెూంగార్డు సిబ్బంది ప్రోగు చేసిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు చెక్కు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ ఏప్రిల్ 21న జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - పోలీసుశాఖలో హెూంగార్డుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన లేదా ప్రమాదవసాత్తు లేదా అనారోగ్య కారణాలతో మృతి చెందిన హెూంగార్డు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు విజయనగరం పోలీసు యూనిట్ లో పని చేస్తున్న హెూంగార్డ్సు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు మొత్తాన్ని ప్రోగు చేసి, వారి కుటుంబాలకు "చేయూత"గా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వలన పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతోపాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఇందులో భాగంగా విజయనగరం జిల్లాలో హెూంగార్డుగా సుదీర్ఘ కాలం పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కాజా రామారావును ఆర్థికంగా ఆదుకొనేందుకు 'చేయూత'గా హెూంగార్డ్సు సమకూర్చిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు రూ.3,24,470/-ల చెక్కు జిల్లా ఎస్పీ పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అందజేసారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఎఓ పి.శ్రీనివాసరావు, హెూంగార్డ్సు ఇన్చార్జ్ ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, కార్యాలయ పర్యవేక్షకులు టి.రామకృష్ణ మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సియం రిలీఫ్ ఫండ్ పత్రాన్ని బాధితురాలికి అందించిన ఎమ్మెల్యే ఎంజిఆర్



**పాతపట్నం ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి న్యూస్..** కృష్ణవేణి పొల్లయి వైద్య ఖర్చుల నిమిత్తం 5,00,000/- రూపాయిల సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలను అందించిన ఎమ్మెల్యే . కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలి,కుటుంబ సభ్యులు... పాతపట్నం నియోజకవర్గం పాతపట్నం మండలంలో గల బూరగాం గ్రామానికి చెందిన సాయిబొ పొల్లయి గారి భార్య కృష్ణవేణి పొల్లయి గారు మెదడుకు సంభందించిన సమస్యతో బాధపడుతూ వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు వద్ద విన్నవించుకోగ ముఖ్యమంత్రి సహాయానిదికి సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేపించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఐదు లక్షలు (5,00,000/-)రూపాయిలు సీఎం రిలీఫ్ ఫండ్)పత్రాలను అందించారు.అనంతరం ఆయన మాట్లాడు తూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డీఏ ప్రభుత్వం అని తెలియజేశారు.పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎంఆర్ఎఫ్ నిధులు అందిస్తున్నారు.అలాగే ఈ నియోజకవర్గంలో గత పాలకులు ఏరోజైనా సీఎం సహాయనిది కోసం ఒక్క దరఖాస్తు అయిన చేయలేదని నియోజకవర్గ ప్రజలకు గుర్తు చేశారు.

# మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని కొంతమంది గుర్తుతెలియని దుండగులు కూల్చివేసి, ధ్వంసం చేశారు

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న తీరు మార్చుకోవాలి....

వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ..

**పాతపట్నం ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి న్యూస్..** వైయస్ఆర్ గా ప్రసిద్ధి చెందిన వైయస్ రాజశేఖర రెడ్డి, కాంగ్రెస్ కురువృద్ధుడు, 2004 నుండి 2009 వరకు అప్పటి అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన మాజీ ముఖ్యమంత్రి మరియు వైయస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి తండ్రి. వైఎస్ రాజశేఖర రెడ్డి మరణించిన తర్వాత కూడా, ఆయన ప్రజలలో ప్రజాదరణ పొందిన వ్యక్తి. ప్రజలకు ఎన్నో మంచి పథకాలు తెచ్చి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసిన మహనీయుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలు ధ్వంసం చేస్తున్నారంటే ఏమనుకో వాలి.శ్రీకాకుళం రూరల్ మండలం బైరి గ్రామంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై వైఎస్ఆర్సీపీ తీవ్రంగా ఖండిస్తుంది. ఈ ఘటన పై వెంటనే పోలీసులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఇలాంటి దుశ్చర్యలుకు పాలపడిన వారు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తు ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.మీకేమైనా రాజకీయ కక్షలు ఉంటే ధైర్యంగా ఎదుర్కొండి అంతేగాని పిరికి వాళ్ళ మాదిరిగా విగ్రహాల ధ్వంసం చేయడం ఏంటి ఈ కూటమి గవర్నమెంట్ వచ్చిన తర్వాత అనేక విగ్రహాల ధ్వంసం చేయడం జరిగింది మీరు ధైర్యంగా ముందుకు వచ్చి ఎదుర్కోలేక ఇటు విగ్రహాలు ధ్వంసం చేయడం పద్ధతి కాదని హెచ్చరించారు.



## పోరాటాల ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల - డివైఎఫ్ఐ...




**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** రాష్ట్రంలో నిరుద్యోగులు ఐక్యంగా అనేక పోరాటాలు చేయడం ద్వారానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల సాధ్యం అయిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ డివైఎఫ్ఐ జిల్లా కమిటీ స్వాగతిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ ఉపాధ్యక్షులు సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ కు సంబంధించి భవిష్యత్తులో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో 30వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా కేవలం 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ గురించి రాష్ట్ర ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. జిల్లాకు ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు పై రాష్ట్ర ప్రభుత్వం పునర్ ఆలోచించాలని కోరారు. పీఈటీ పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. పరీక్ష గడువు 70రోజులు అయినా పెంచాలని కోరారు. పోరాటాల సందర్భంగా డివైఎఫ్ఐ నాయకుల పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు..

## యువ సమ్మేళన కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి..

విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్.





**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, యువత హైదరాబాద్ మరియు చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 26న నిర్వహించే యువ సమ్మేళనం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఏప్రిల్ 21న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం కు సంబంధించి, ప్రత్యేకంగా రూపొందించిన బ్రౌచర్ ను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. ఈ నెల 26న ఎస్విఎన్ నగర్ లో గల సుజాత కన్వెన్షన్ సెంటర్ మాజీ డి ఆర్ డి ఓ చైర్మన్, కేంద్ర రక్షణ శాఖ శాస్త్రీయ సలహాదారులు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సలహాదారులు అయినటువంటి వ్యాప్తంగా డాక్టర్ జి సతీష్ రెడ్డి గారిచే మోటివేషన్ క్లాస్ నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హజరత్ ఖాదర్ వాలి బాబా దర్గా అండ్ దర్బార్ షరీఫ్ డాక్టర్ ఎండి ఖలీలుల్లా షరీఫ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్అంబేద్కర్, ఐ.ఏ.ఎస్, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పాల్గొని ఉంటారు ఈ కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ సొసైటీ అధ్యక్షులు మరియు ప్రోగ్రాం ఇంచార్జ్ ఎం.రాము గవర్నమెంట్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు ప్రోగ్రాం ఇంచార్జ్ వి.సత్యనారాయణ ప్రోగ్రాం టీం మెంబర్స్ పి.దుర్గాప్రసాద్ ఎస్.గురుప్రసాద్ ఎం.మధు కుమార్ , జి.లేఖ్య ఎం.ఉమ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో పంచాయతీ నిధులు పక్కదారి పడుతున్నాయి.. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి..



**పాతపట్నం, ఏప్రిల్ 21, ప్రజా జ్యోతి న్యూస్..** కూటమి ప్రభుత్వ హయాంలో పల్లెలుఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి అన్నారు. దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలే. అలాంటి గ్రామాలలో అభివృద్ధి, పారి శుధ్య పనులు చేపట్టేందుకు విడుదలవుతున్న నిధులు గ్రామపంచాయతీలకు చేరకుండా పక్కదారి పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోగా, కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులు కూడా పక్కదారి పట్టించారని పలువురు సర్పంచ్లు ఆరోపిస్తున్నారు.గ్రామాల అభివృద్ధి కోసం విడుదలైన నిధులను సైతం పక్కదారి పట్టించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే పలు సభల్లో సర్పంచులకు తగిన గౌరవం ఇచేస్తున్నామని పదేపదే చెప్తూ స్టేజిలవరకే పరిమితం చేశారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో సర్పంచులను పూచిక పుల్లలాగా తీసివేసి ఒక్క రూపాయి కూడా నిధులు పంచాయతీలకు కేటాయించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం ఆయా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేయలేదు. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడేస్తోంది అనే చర్చ అధికార వర్గాలో సాగుతోంది. గ్రామ పంచాయతీలు మండల, జిల్లా పరిషత్ల ఖాతాల్లో జమ చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.1,121.20 కోట్లను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నాలుగు నెలలుగా తొక్కిపెట్టింది. గతంలో విమర్శలు వచ్చిన తరువాత తప్ప నిసరై స్థానిక సంస్థలకు అరకొర నిధులు విడుదల చేసింది.సర్పంచులకు నిధులు కొరత వలన తాగునీరు, పారిశుద్యం, గ్రామ అభివృద్ధికి నోచుకోకుండా పోయింది. ఈ కూటమి ప్రభుత్వం కేటాయించాల్సిన నిధులు ఇతర అవసరాలకు వినియోగించుకుంటూ కాలయాపన చేస్తుంది. కనీసం త్రాగునీటి సమస్యలను కూడా తీర్చలేని దీనస్థితిలో ఉంది ఈ కూటమి పాలన.

# అరుదైన మూలకాలు మానవాభివృద్ధికి దోహదం చేసేలా చూడాలి

## తిరుపతిలో ప్రారంభమైన మూడు రోజుల రేర్ ఎర్త్స్ టెక్నాలజీ అంతర్జాతీయ సదస్సు. హాజరైన 200 మంది దేశ, విదేశీ శాస్త్రవేత్తలు, యూనివర్సిటీల ప్రొఫెసర్లు, పరిశోధకుల




**ఏప్రిల్ 21,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** భూమి లోపల లభ్యమయ్యే అరుదైన మూలకాలు మానవ అభివృద్ధికి దోహదం చేయాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఫిజిక్స్ విభాగం - శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ సదస్సును చేపట్టాయి. సైన్స్, టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేర్ ఎర్త్స్ అంశంపై మూడు రోజులపాటు ఈ అంతర్జాతీయ సదస్సు కొనసాగనుంది. ఇందుకు సంబంధించిన ప్రారంభ సభ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు. సుమారు 200 మంది దేశ, విదేశీ శాస్త్రవేత్తలు, యూనివర్సిటీల ప్రొఫెసర్లు, పరిశోధకులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సదస్సు ప్రారంభ సభలో పద్మావతి మహిళా యూనిర్సిటీ వీసి ప్రొఫెసర్ వెన్నం ఉమ మాట్లాడుతూ.. భూమి లోపలి అరుదైన మూలకాలను వెలికి తీసే క్రమంలో వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా చూడాలని కోరారు. సేకరించిన అరుదైన మూలకాలను దేశ ప్రగతికి ఉపయోగపడేలా మార్చవలసిన బాధ్యత ఈ తరం శాస్త్రవేత్తలపై ఉందని గుర్తు చేశారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ అంతర్జాతీయ సదస్సుకు పద్మావతి యూనివర్సిటీ వేదిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ.. కంప్యూటర్స్, కమ్యూనికేషన్ వ్యవస్థ, లేజర్ సిస్టం లో అరుదైన మూలకాల పాత్ర ఎక్కువగా ఉంటుందని చెప్పారు. మానవ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో రేర్ ఎర్త్స్ బాగా తోడ్పడుతాయని అభిప్రాయపడ్డారు. శాస్త్ర చికిత్సలు చేయడంలోనూ రేర్ ఎర్త్ కిరణాలు ఉపకరిస్తాయని అన్నారు. అరుదైన మూలకాలు ఎక్కువగా చైనాలో లభ్యం అవుతున్నట్టు తెలిపారు. జపాన్ వంటి దేశాల్లో రేర్ ఎర్త్ ప్రాసెసింగ్ ఎక్కువగా జరుగుతుందని అన్నారు. రేర్ ఎర్త్ వల్ల ఒకవైపు వ్యక్తిగత ఉపాధి అవకాశాలతో పాటు మరోవైపు సామాజిక ప్రయోజనం ఉంటుందని వివరించారు. నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రేర్ ఎర్త్స్ టెక్నాలజీ మన దేశంలోనూ రాష్ట్రంలోనూ మరింత ప్రాధాన్యతను సంతరించుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. ప్రత్యేకించి విద్యారంగంలో బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో రేర్ ఎర్త్స్ టెక్నాలజీని ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. థాయిలాండ్ కు చెందిన నిఖోన్ పాథమ్ రాజ్ భట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జాక్రపాంగ్ కియోఖో మాట్లాడుతూ.. యూరోపియం, సమేరియం, డెస్ప్రోజియం, నియోడియం, ఎటర్బియం వంటి అరుదైన మూలకాలు సమాజాభివృద్ధికి బాగా ఉపయోగపడే అవకాశం ఉందని అన్నారు. ఈ మూలకాల ద్వారా వెలువడే కాంతి కిరణాలు క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నియంత్రణకు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఇండోనేషియా కు చెందిన బంధుంగ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ మిత్ర డి జమల్ మాట్లాడుతూ.. గడలోనియం, తులియం, హెూల్మియం వంటి మూలకాలు అనేక రకాలుగా ఉపయోగపడతాయని చెప్పారు. ప్రత్యేకించి రేర్ ఎర్త్స్ సౌర శక్తిని విద్యుత్ శక్తిగా మార్చడంలో దోహదం చేస్తాయని వివరించారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ.. ఈ అంతర్జాతీయ సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పద్మావతి వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని మాట్లాడుతూ.. ఈ సదస్సు ద్వారా యూనివర్సిటీ విద్యార్థులకు, పరిశోధకులకు రేర్ ఎర్త్స్ టెక్నాలజీ గురించి అవగాహన కలిగే అవకాశం ఉందని తెలిపారు. రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ దీపేంద్ర సింగ్ మాట్లాడుతూ.. అరుదైన మూలకాలపై పరిశోధనలకు, పరిశోధనలకు ,ప్రాజెక్టులకు, సదస్సుల నిర్వహణకు తాము అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఈ సదస్సులో భాగంగా చేపట్టిన సమాంతర సదస్సుల్లో పలు ప్రాంతాల నుంచి హాజరైన శాస్త్రవేత్తలు, యూనివర్సిటీల ప్రొఫెసర్లు, పరిశోధకులు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ఓరల్ ప్రజెంటేషన్ చేశారు. ప్రారంభ సదస్సులో సదస్సు సావనీరును అతిథులు ఆవిష్కరించారు. అతిథులను సదస్సు నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రేర్ ఎర్త్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా కార్యదర్శి డాక్టర్ ఎం. ఎల్. పి. రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సీకే జయశంకర్, అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజు, సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్ . జాన్ సుష్మా, ప్రొఫెసర్ ఆర్ ఉష పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, వివిధ ప్రాంతాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 10సం.ల కఠిన కారాగారం, జరిమానా..

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము :** జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో ఆరు మాసాల్లో ప్రాసిక్యూషను పూర్తి చేసి, నిందితుడికి శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టిన పోలీసు అధికారులు.
విజయనగరం జిల్లా బొబ్బిలి పోలీసు స్టేషన్లో 2024 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం కింతలాంబ గ్రామానికి చెందిన కిల్లక మోహనరావు అలియాస్ మోహన్ (29సం.లు)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి శ్రీమతి కే.నాగమణి గారు 10సం.ల కఠిన కారాగార శిక్ష మరియు రూ.2,000/-లు జరిమానా విధిస్తూ ఏప్రిల్ 21న తీర్పు వెల్లడించినట్లుగా విజయనగరం జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందల్, ఐపిఎస్ మార్చి 28న తెలిపారు.
వివరాల్లోకి వెళ్ళితే.. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన 16 సంవత్సరాల బాలిక పార్వతీపురం పట్టణంలో ఏకలవ్య స్కూల్లో చదువుతున్నట్లు, ఆమె ఆవసరాల కోసం తన మామయ్యను రూ.3000/- లు కావాలని అడుగ్గా తన మామయ్య ఫోన్ ఫే ద్వారా బొబ్బిలిలో ఉంటున్న నిందితుడు మోహన్ కు పంపినట్లు, సదరు డబ్బులు తీసుకొనేందుకు ఆమె పార్వతీపురం నుండి బొబ్బిలికి వచ్చి, పట్టణంలో ఉంటున్న తన మామయ్య స్నేహితుడు కిల్లక మోహనరావు అలియాస్



మోహన్ (29సంఎలు) వద్దకు వెళ్ళగా, డబ్బులు ఇస్తానని చెప్పి ఆమెను రూమ్ కు తీసుకువెళ్ళి, బాలికపై అత్యాచారంకు పాల్పడినట్లు, జరిగిన విషయాన్ని తన మామయ్యతో చెప్పగా వెంటనే 112 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయగా పార్వతీపురం పోలీసులు వచ్చి రిపోర్టు తీసుకొని జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, బొబ్బిలి పోలీసు స్టేషనుకు ట్రాన్స్ఫర్ చేశారు. దీనిపై బొబ్బిలి ఇన్స్పెక్టరు కె.సతీష్ కుమార్ పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషను ఆరు మాసాల్లో పూర్తి అయ్యే విధంగా బొబ్బిలి పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టరు కె.సతీష్ కుమార్ చర్యలు చేపట్టగా, నిందితుడు కిల్లక మోహనరావు అలియాస్ మోహన్ (29సంఎలు) మైనరు బాలికపై అత్యాచారంకు పాల్పడి నట్లుగా నేరం రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి గారు నిందితుడికి 10 సం.లు కఠిన కారాగారం మరియు రూ.2,000/- ల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కేసులో బాధితురాలికి రూ.5లక్షల నష్ట పరిహారంను మంజూరు చేయాలని అధికారులను ఆదేశిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పును వెల్లడించారన్నారు. ఈ కేసులో నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసువారి తరుపున ఫోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు మెట్టా ఖజానారావు వాదనలు వినిపించగా, బొబ్బిలి ఇన్స్పెక్టరు కె.సతీస్ కుమార్ పర్యవేక్షణలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎం.మన్మధరావు, సి.ఎం.ఎన్. హెడ్ కానిస్టేబులు సిహెచ్.రామకృష్ణ సాక్షులను కోర్టులో హాజరుపర్చారన్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా పోలీసువారి తరుపున వాదనలు వినిపించి పబ్లిక్ ప్రాసిక్యూటర్మెట్టా ఖజానారావు, ఇతర అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ గారు అభినందించారు.

## నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపే కూటమి ప్రభుత్వం.....

మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదలే దీనికి నిదర్శనంలి..
మాట నిలబెట్టుకున్న ఏపి.సియం చంద్రబాబులి
చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.



**ఏప్రిల్ 21,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడిన కూటమి ప్రభుత్వం.., మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి.., నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపేందుకు సిద్ధమైందనీ..ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో కొనియాడారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా.. కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సి నోటిఫికేషన్ను విడుదల చేసింది..ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీను నిలబెట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధిని సోమవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో అభినందినలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రకాల అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ఎనలేనిది అన్నారు. మరీ ముఖ్యంగా నిరుపేదలు లేని సమాజ స్థాపనే ఆయన లక్ష్యమని చెప్పారు. అదేసమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టి.., తాజాగా మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి..,16347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి కంకణం కట్టుకోవడం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనా దక్షతకు నిలువెత్తు నిదర్శనం అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ప్రశంసించారు. ఇకపోతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.., విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు.. ఇందులో కీలక పాత్ర పోషించి.., రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయడం శుభపరిణామమన్నారాయన. 2047 విజన్ తో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజా దీవెనలు మెండుగా ఉన్నాయన్నారు.

## పసి పిల్లలను వద్దనుకుంటే ఊయలలో వేసి రక్షించండి

**- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్**








**ఆమదాలవలస ,ప్రజా జ్యోతి న్యూస్ :** పసి పిల్లలను వద్దనుకుంటే ఊయలలో వేసి రక్షించాలని స్థానిక ఎమ్మెల్యే , రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు.ఆమదాలవలస మండలం జొన్నవలస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఊయల కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ పసి పిల్లలు వద్దనుకునేవారు ప్రభుత్వం గవర్నమెంట్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన ఈ ఊయలలో వేయాలని సూచించారు.అవాంచిత గర్భం దాల్చేవారు, ఆడపిల్లలను, అనారోగ్యవంతులని, అంగవైకల్యం కలవారని పుట్టిన పిల్లలను చెత్తకుప్పల్లో వేయకుండా ఆస్పత్రిలో ఉన్న ఊయలలో వేయాలని తెలిపారు. పిల్లల్ని శిశు సంక్షేమ శాఖ ద్వారా శిశు గృహాల్లో సంరక్షించి, చట్టపరంగా దత్తత ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. పసిపిల్లలను ఊయలలో వేస్తే అటువంటి వ్యక్తుల సమాచారాన్ని గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.పసిపిల్లలనుముళ్ళ పొదల్లో, బయట పారవేయకుండా ఊయలలో వేయాలని సూచించారు .ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగులకు ఇస్తున్న సౌకర్యాలుని పరిశీలించి రోగులకు సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ అండ్ రూరల్ ప్రజాప్రతినిధులు మొదలవలస రమేష్ , నూకరాజు , బోర గోవిందరావు , తమ్మినేని గీత, తంబీ , చంద్రశేఖర్ , ఢిల్లేశ్వరరావు , అప్పలనాయుడు , మురళి , మండల ఈ. ఓ.పి.ఆర్.డి, ఐ.సి.డి.ఎస్ పి. ఓ అనూరాధ ,హాస్పిటల్ సూపరింటెండెంట్, మెడికల్ ఆఫీసర్స్, స్టాఫ్, ఐ .సి.డి.ఎస్ స్టాఫ్ అండ్ సూపెర్వైసోర్స్ అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో 2025- 2026 విద్యాసంవత్సర ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్..




**పాతపట్నం ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నంమండల విద్యాశాఖ అధికారి వారి ఆదేశాల మేరకు సోమవారం నాడు మండలంలోని అన్ని పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల ప్రవేశాల నిమిత్తం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు.

## శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షలు రెండు రోజులు వాయిదా.



**ఏప్రిల్ 21,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 22 , 23 వ తేదీలలో ఆరంభం కావలసిన బి. ఏ, బి.కాం, బియస్సీ డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు అనగా మొదటి రెండు రోజులలో జరగాల్సిన సబ్జెక్టులను వాయిదా వేస్తున్నట్లు యస్వీయూ పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలియజేశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 22 నుంచి పరీక్షలు ప్రారంభం కావాల్సి వుంది. కొన్ని సాంకేతిక కారణాల రీత్యా వాయిదా పడ్డాయని, ఈ రెండు పరీక్షలను మే నెల 12 ,14 తేదీల్లో నిర్వహిస్తానని వారు తెలియజేశారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జరగవలసిన వివిధ సబ్జెక్టులు యథాతథంగా ,ఆయా తేదీల్లోనే జరుగుతాయని ,ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని వారు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## జలవనురుల శాఖ మంత్రి పర్యటన

టెక్కలిలో పునరావాస కాలనీల పరిశీలన, కలెక్టరేట్‌లో సమీక్ష.



**శ్రీకాకుళం, ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి న్యూస్** రాష్ట్ర జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు రోడ్డు మార్గం ద్వారా టెక్కలికి బయలుదేరి, మధ్యాహ్నం 2.30 గంటలకు వంశధార ఎడమ కాలువ (ఎల్‌బీసీ)ను, అలాగే మదనగోపాలపురంలో పునరావాస కాలనిని పరిశీలిస్తారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని, సాయంత్రం 5.30 గంటలకు సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు మీడియా ప్రతినిధులతో మాట్లాడి, రాత్రి 7.00 గంటలకు విశాఖపట్నంకు బయలుదేరనున్నారు.

## పాలకొల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు ఆధార్ కార్డ్ సవరణ కేంద్రం.

**పాలకొల్లు. ప్రజాజ్యోతి.(కొట్టి రామం )ఏప్రియల్ 21.** స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి అటానమస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు ప్రాతీయ తపాలా కార్యాలయం సంయుక్త నిర్వహణ లో ఈ నెల 22 తేదీ మంగళవారం ఆధార్ కార్డు సవరణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. భారత ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఆధార్ కార్డులో మార్పుల చేర్పులకు సంబంధించి పాలకొల్లు పరసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తప్పుఒప్పులను సరిచేసుకొనుటకు,పుట్టినతేదీ,అక్షరదోషాలు తొలిగించుకొనుటకు,నూతన ఆధార్ కార్డులు నమోదుచేసుకొనుటకు ఇది చక్కని అవకాశమని మంగళవారం ఉదయం 10 గంటలనుండి సాయింత్రం 4 గంటల వరకు కళాశాల ప్రాంగణంలో జరిగే ఈ సవరణ కేంద్రాన్ని ఉపయోగించుకోవచ్చునన్నారు.

## మే 1, 2వ తేదీలలో వాచీల ఈ-వేలం



తిరుమల తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను మే 1, 2వ తేదీలలో రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నారు. ఇందులో టైటాన్, సిటిజన్, సొనాట, రాగా, టైమ్స్, టైమెక్స్, ఇతర కంపెనీల స్మార్ట్ వాచీలున్నాయి. కొత్తవి/ఉపయోగించిన/పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 62 లాట్లు ఈ-వేలంలో ఉంచారు.

# ఆరేళ్ల కల సీఎం చంద్రబాబుతో సాకారం







**శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు**

**తిరుపతిలో డీఎస్సీ విడుదల సందర్భంగా కృతజ్ఞతలు తెలిపిన డీఎస్సీ అభ్యర్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు**

**చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం**

**ఏప్రిల్ 21,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** డీఎస్సీ అభ్యర్థుల ఆరేళ్ల కలను రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు , విద్యాశాఖామంత్రి నారా లోకేష్ సాకారం చేశారని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీని విడుదల చేసి ఇది మంచి ప్రభుత్వం అని మరోసారి నిరూపించుకుందన్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్డీఓ ఆఫీసు ఎదుట డీఎస్సీ విడుదల సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి చంద్రబాబు, లోకేష్ లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సర్, లోకేష్ అన్న అంటూ ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు ప్లకార్డులు పట్టుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఇదే ప్రాంతంలో అభ్యర్థులతో కలిసి అనేక నిరసనలు, ధర్నాలు చేపట్టామని, కనీసం పట్టించుకున్న దాఖలాలులేవన్నారు. అభ్యర్థులు ఆర్తనాదాలు పెట్టినా స్పందించలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు, లోకేష్ లు నెరవేర్చి అభ్యర్థులకు అండగా నిలిచారన్నారు. అన్ని కేటగిరీలకు న్యాయం జరిగేలా డీఎస్సీ రూపొందించారన్నారు. అనంతరం తిరుపతి పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ డీఎస్సీ విడుదల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారని, అన్న విధంగానే సంవత్సరంలోనే 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఆరేళ్లుగా నిరీక్షించి అలసిపోయిన అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా మాజీ సీఎం జగన్ రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర సభ్యులు ఆర్కే నాయుడు, విష్ణు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం





**స్వలాభంతో 40 లక్షల రోడ్డు మంజూరు**

**ఎన్.ఆర్.జి.ఈ.ఎస్ పనుల్లో మేట్ ల నియామకంలో పక్షపాతం**

**జిరాయితీ పొలాల్లోకి మురుగునీరు**

**వైసిపి వారనే నెపంతో ఫీల్డ్ అసిస్టెంట్ పై వేధింపులు**

**వికలాంగ బాలుని వివరాల నమోదు లో నిర్లక్ష్యం**

**ఇష్టానుసారంగా అక్రమ ఇసుక త్రవ్వకాలు**

**వైకాపా నియోజకవర్గ ఇంచార్జీ చింతాడ రవికుమార్**

**ఆమదాలవలస , ప్రజా జ్యోతి న్యూస్ :** ఆమదాలవలస నియోజకవర్గం కు సంబంధించి పలు సమస్యలపై వైకాపా నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్ కలెక్టర్ గ్రీవెన్స్ లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రోజురోజుకీ అక్రమాలు ,అన్యాయాలు పెరిగిపోతున్నాయన్నారు. సరుబుజ్జిలి మండలం దకరవలస పంచాయతీ లో ఎటువంటి ఆవాసాలు లేకపోయినప్పటికీ కూటమి నాయకులు తమ స్వలాభం కోసం ఇతర గ్రామాలకు రహదారి కాకుండా తమ సొంత పొలాలకు 40 లక్షల ఎన్ ఆర్ జి ఈ ఎస్ నిధులు రోడ్ మంజూరు చేయడం ఆక్రమమన్నారు. సరుబుజ్జిలి మండలం సుభద్రాపురం గ్రామంలో జరుగుచున్న ఎన్.ఆర్.జి.ఈ.ఎస్ పనుల్లో మేట్ ల నియామకం లో మండల అధికారుల పక్షపాత ధోరణిని ఆయన ఖండించారు. ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామంలో మురుగునీటి కాలువల నిర్మాణం జరిపి మురుగునీరు జిరాయితీ పొలాల్లోకి వదిలివేయడం అలాగే సాంకేతిక లోపాలపై ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. వీటితో పాటు బూర్జ మండలం నీలాదేవిపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ను వైసీపీ పార్టీ కి చెందిన వారనే నెపంతో మండల అధికారులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు.పొందూరు మండలం కింతలి గ్రామం లో వికలాంగ బాలునికి వివరాలు నమోదుకు మండల అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ఇసుక మాఫియాగా ఏర్పడి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని ,అధికారం చేపట్టిన నాటి నుండి విధ్వంసాలు , అక్రమలే తప్ప అభివృద్ధి శూన్యమని తెలిపారు.ప్రజలు కూటమి నాయకుల అరాచకాలను గమనిస్తున్నారని పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికై మున్సిపల్ కమిషనర్ కు వినతి

**సమస్యలు పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం: సిపిఎం పట్టణ కార్యదర్శి కె. శ్రీను**



**బద్వేల్ ఏప్రిల్ 21( ప్రజా జ్యోతి న్యూస్)** సోమవారం నాడు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని 35 వార్డులలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్ కమిషనర్ వి.వి నరసింహారెడ్డి గారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతాలైన సుందరయ్య కాలనీ, ఐలమ్మ కాలనీ, జ్యోతి బస్ కాలనీ మరియు తదితర కాలనీలు ఏర్పడక మునుపు ఆ ప్రాంతాలన్నీ నివాసానికి యోగ్యం కాకుండా ఉండి రాళ్లురప్పలు,కొండతిప్పలు,విష సర్పాలు సంచరిస్తున్న అడవిని తలపిస్తున్న ప్రాంతంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన పేదలందరూ గుడిసెలు వేసుకొని అక్కడే స్థిరనివాసాలు ఉంటూ కూలీనాలీ చేసుకుని జీవించసాగి దాదాపు 20 సంవత్సరాల పైబడి అవుతున్నది. గతంలో సదరు ఏరియాలలో నివాసముండే పేదలందరూ మున్సిపల్ అధికారులకు విన్నవించుకొనగా సదరు కాలనీలలో ఇంటి డోర్ నెంబర్లు వేసి, ఇంటి పన్ను విధించడంతో ప్రస్తుతం పన్ను ఉన్న వారందరూ పన్నులు చెల్లిస్తున్నారు. సదరు కాలనీలలో గడచిన 20 సంవత్సరాలుగా అక్కడే స్థిరంగా నివాసముంటూ అసౌకర్యాల నడుమ మౌలిక వసతులు లేకున్నప్పటికీ అనేక ఇబ్బందులను ఎదుర్కొనొచ్చు జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం బద్వేలు పట్టణం దినదినాభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో సదరు కాలనీలలో కూడా నివాసాలు ఉండే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నప్పటికీ మున్సిపాలిటీ నుంచి నూతనంగా నిర్మించుకొని కాపురాలు ఉంటున్న ఇండ్లకు మున్సిపాలిటీ ద్వారా ఇంటి డోర్ నెంబర్లు వేసి పన్నులు వేయకపోవడంతో కరెంటు మీటర్లు కావాలన్నా, గృహ నిర్మాణ శాఖ ద్వారా పక్కా బిల్డింగులు పొందాలన్నా తదితర ప్రభుత్వ పథకాలకు అర్హత పొందాలన్నా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. శివారు ప్రాంతాల్లో ఉన్న కాలనీలకు బ్రహ్మ సాగర్ మంచినీటి పైపులైను వేయకపోవడంతో మంచినీరు కొరకు అనేక అవస్థలు పడుతున్నారని, నివాసమున్న వారందరికీ 200/- రూపాయలకే బ్రహ్మ సాగర్ మంచినీటి కుళాయి కనెక్షన్ క్రమబద్ధీకరించాలని, 130 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధుల పెండింగ్ పనులను పూర్తి చేయాలని, మున్సిపాలిటీ నిధులు, ప్రభుత్వ గ్రాంట్లు, ప్రభుత్వం కేటాయించిన ఇతర ప్రత్యేక నిధులలో జమా -ఖర్చులు, అభివృద్ధి పనుల పైన శ్వేత పత్రం విడుదల చేయాలని, పెరుగుతున్న పట్టణ జనాభా, విస్తీర్ణం దృష్ట్యా పట్టణ జనాభా కు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించుటకు అవసరమైన చర్యలను చేపట్టాలని,మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో వెలగని వీధి దీపాలను గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలని, పేదలు నివసించే కాలనీలలో రోడ్లకు అడ్డంగా మొలచిన కంపచెట్లను తొలగించాలని, మున్సిపాలిటీ పరిధిలో గల అన్ని వార్డులలో మురుగునీటి పారుదల కొరకు సమగ్రమైన శాశ్వతమైన ప్లాన్ రూపొందించి కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు.

రానున్న వర్షాకాలా దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టాలని, పట్టణములో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు,కోతులను ఊరి బయటకి తరలించుటకు అవసరమైన చర్యలను చేపట్టాలని, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని స్మశానవాటికలను అభివృద్ధి చేయుటకు అవసరమైన చర్యలను చేపట్టాలని తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన కమిషనర్ ఒక వారం రోజుల్లోపు కాలనీలలో పర్యటించి సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేస్తానని తెలియజేశారు.

కమిషనర్ గారు తెలిపిన విధంగా వారం రోజుల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ప్రజల్ని సమీకరించి సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని,షేక్ మస్తాన్ షరీఫ్, గంప అనంతమ్మ, పసుపుల మోక్షమ్మ,సగిలి రాయప్ప, శాఖా కార్యదర్శులు షేక్ మస్తాన్ బీ,మూరా ప్రసాద్, పార్టీ కార్యకర్తలు కాకర్ల బాబయ్య, గంప సుబ్బరాయుడు,కలకట్ల మస్తాన్, షేక్ ఖాజా, మల్లికార్జున,పాతకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మి తాండ గ్రామాన్ని సందర్శించి ఎన్.సి.మల్లికార్జున ఎస్సైజొన్నగిరి



**ప్రజా జ్యోతి తుగ్గలి** కర్నూలు జిల్లా విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు తుగ్గలి మండలం జొన్నగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ మల్లికార్జున వారి సిబ్బంది తో కలిసి జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మి తాండ గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించడం అయినది. రాబోయే గ్రామ జాతర ను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని, ఎటువంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని తెలుపుతూ అదేవిధంగా

1.గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని
2.రోడ్డు ప్రమాదాల పైన
3.మహిళ పై జరిగే నేరాలపైన
4.సైబర్ నేరాలపైన అవగాహనా కల్పించడం అయినది.

ఈ కార్యక్రమం లో పోలీసులు జగన్,మదన్,జనార్ధన్ లు మరియు లక్ష్మి తాండ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాఠశాలను గ్రామంలోనే ఉంచాలి

**వేరొక చోటుకు మల్లించవద్దు**

**అవేదన వ్యక్తం చేస్తున్న వావిలపల్లి గ్రామస్తులు**

**ఎం.ఈ. ఓ కార్యాలయం ఎదుట ఆందోళన**

**సొమ్మసిల్లి పడిపోయిన గ్రామస్తురాలు**



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** విద్యార్థుల సంఖ్య తగ్గుతుందనే నెపంతో పొందూరు మండలం వావిల పల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను వేరొక చోటుకు మళ్లించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడం తో గ్రామంలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వావిలపల్లి పేట నుండి వి.ఆర్ గూడెం గ్రామానికి పాఠశాల ను తరలిస్తే గ్రామంలో ఉన్న విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. తమ గ్రామంలో ఉన్న పిల్లలు చదువుకు దూరం కాకుండదనే వావిలపల్లి గ్రామం లోనే పాఠశాలను కొనసాగించాలని కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం నాడు మండల కేంద్రం లో ఉన్న ఎం.ఈ. ఓ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ఆరుబయట గ్రామస్తులంతా ధర్నా చేపట్టారు. పాఠశాలను మల్లించవద్దు గ్రామం లోనే ఉంచాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళన లో గ్రామానికి చెందిన ఒక మహిళ అక్కడిక్కడే సొమ్మసిల్లి పడిపోయారు. పాఠశాలను మళ్ళించే నిర్ణయాన్ని ఉపసనహరించుకోవాలని లేని యెడల కలెక్టరేట్ ను ముట్టడిస్తామని తెలిపారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ



**తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం ఏప్రిల్21,ప్రజాజ్యోతి న్యూస్** రోడ్ ప్రమాదాలను నివారించుటలో భాగంగా హెల్మెట్ వాడకంపై అవగాహన పెంచుటకై మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు కి ఇరువైపులా సూచికబోర్డులు ఏర్పాటు చేయడమైనదని సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ కుమార్ అన్నారు. విద్య, వైద్యంతో పాటుగా ప్రజలను చైతన్య పరచటం సంస్థ ప్రాథమిక కర్తవ్యమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం కనీస బాధ్యత అని, యజమాని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చే వరకు కుటుంబ సభ్యులంతా యజమాని క్షేమంగా చేరాలని ఎంతో ఆశగా ఎదురుచూస్తారని, ప్రాణాలు భద్రంగా కాపాడుకోవడానికి హెల్మెట్ రక్షకతంత్రంలా పనిచేస్తుందని అన్నారు.సంస్థ గౌరవ చైర్మన్ సింహాద్రి జనార్ధన్ మాట్లాడుతూ హెల్మెట్ వాడకంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం జరగాలని, ప్రభుత్వం, పోలీసులతో పాటు సమాజ బాధ్యత కోసం మానవత కూడా నడుం బిగించిందని అన్నారు. ప్రతిఒక్క ద్విచక్ర వాహనదారు విధిగా హెల్మెట్ ధరించి, ప్రాణాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మానవత సేవా సంస్థ సభ్యులు, పోలీసు శాఖ , ప్రజలు పాల్గొన్నారు

## ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కార్యక్రమం



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం,ఏప్రిల్21 ప్రజా జ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామ పంచాయతీ లో సర్పంచ్ గండి రాంబాబు మరియు డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ అధికారి ఏ. ఎస్.ఓ జోడాల వెంకట్ ప్రకృతి వైపరీత్యాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత కాలంలో ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోతున్న కారణంగా ముందస్తు గా తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు గ్రామ ప్రజలకు తెలియపరచాలని జోడాలా వెంకట్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, డి సి ఎస్. శ్రీనివాస్, వీఆర్వో సాయి ,సచివాలయం సిబ్బంది. డ్వాక్రా సి ఎ. లు, అంగన్వాడి టీచర్లుతదితరులు పాల్గొన్నారు

# బెట్టింగ్,మత్తుపదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

**గుంతకల్లు ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి):** పట్టణం లో యువత ఆన్లైన్ బెట్టింగ్,క్రికెట్ బెట్టింగ్,మట్కా,గంజాయి, ఇతర మత్తు పానీయాలలలై యువత బానిసై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, జిల్లా ఎస్పీ పి జగదీశ్, గుంతకల్ డిఎస్పి శ్రీనివాస్, ఆదేశాల మేరకు, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ బోయ మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత ఎక్కువగా ఆన్లైన్ బెట్టింగ్ లకు పాల్పడుతూ ఈజీగా డబ్బులు వస్తాయనే అశతో లక్షల రూపాయలను బెట్టింగ్ లో పోగోట్టుకోంటున్నారు. అలాంటి పరిస్థితి మన గుంతకల్ పట్టణం లో రాకూడదని దీనికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధుడై వుండాలన్నారు. అలాగే సిటీ కల్చర్ లో గంజాయి కు యువత ఎక్కువగా బానిసై అనేక వ్యాధులకు గురిఅవుతూ ప్రాణాలను తీసుకుంటున్నారు.




అలాంటి సంఘటన అనేకచోట్ల అలాంటి సంఘటనలు జరగకుండా ఉండటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నా రు. ముఖ్యంగా తల్లితండ్రులు వారి పిల్లలు స్మార్ట్ మొబైల్ ద్వారా ఏమేమి చేస్తున్నారో వారిపై నిఘా వుంచి ఇలా బెట్టింగ్ ఇతర గంజాయి వ్యసనానికి పాల్పడితే అలాంటి వారిపై పోలిసులకు పిర్యాదు చేస్తే వారికి కౌన్సింగ్ ఇచ్చి వారికి వాటి గురించి అవగాహన కల్పిస్తామన్నారు. నిన్నటి రోజున హిందూపురం లో ఇలా ఓ యువకుడు బెట్టింగ్ భూతానికా భలై పోయాడాని అలా ఎవ్వరూ కూడా తమ పిల్లలను కోల్పోవద్దని తెలిపారు. ఎవరైనా ఇలాంటి వాటికి బానిసలై వుంటే వారి సమాచారం తెలిపితే వారికి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. అదే విదంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించిన వ్యక్తుల పైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటా ము అని హెచ్చరించారు.

# లే అవుట్ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలి..

**జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాలు..**

**బాపట్ల, ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లాలో లే అవుట్ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో బాపట్ల మున్సిపాలిటి మరియు బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లే అవుట్ ల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సెలగల రాజశేఖర్ బాబు పాల్గొన్నారు. 2019 నుండి మున్సిపాలిటీ మరియు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లే అవుట్ల ను గుర్తించి వివరాలు తెలపాలని ప్రభుత్వం ఆదేశించిందని దానికి సంబంధించి మున్సిపాలిటీ, బావుడా పరిధిలోని తొమ్మిది మండలాలలో మొత్తం 183 లే అవుట్లను గుర్తించి వాటి వివరాలను డిటిసిపికి పంపటమైనదని, వివరాలను పత్రికలలో ప్రచురించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అందులో 86 లే అవుట్లను 22ఎ కింద గుర్తించి రిజిస్ట్రేషన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్,స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కు పంపడమైనదని మిగిలిన లే అవుట్లను సబ్ డివిజన్లుగా చేసి పంపాలని వాటిని తిప్పి పంపారని కలెక్టర్ కు వివరించారు. 183 లే అవుట్ల క్రమబద్ధీకరణకు




సాధ్యాసాధ్యాలపై జిల్లా కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. కొత్త లేఅవుట్ల అనుమతులకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ల్యాండ్ కన్వర్షన్ కు, ఇంటి నిర్మాణాలకు సంబంధించి మునిసిపాలిటీ, బావుడా, పంచాయతీ పరిధిలోని నిబంధనలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఆలస్యం అవుతుందని, తద్వారా ప్రభుత్వానికి వచ్చే రాబడి తగ్గుతుందని, బాపట్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని,వాటిని వీలైనంత త్వరలో నిబంధనల మేరకు క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి గంగాధర్ గౌడ్, డిపిఓ ప్రభాకర్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి,బావుడా ప్లానింగ్ అధికారి షేక్ ఖలీషా మరియు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని తాసిల్దార్ కార్యాలయం ముందు

# సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ధర్నా


**గుంతకల్లు ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి):** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు, మరో 176 హామీలను వెంటనే అమలు చేయాలని సోమవారం ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్న ఎన్నికల లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు, మరో 176 హామీలను ప్రభుత్వం అమలు పరచకపోవడంతో ప్రజలు ఎన్నికల హామీలను అమలు పరచమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతూ ప్రజల్ని మోసం చేయడం జరుగుతు న్నది అన్నారు. 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల మహిళలకు ప్రతినెల 1500 రూపాయలు , ప్రతి కుటుంబంలో చదువు కుంటున్న ప్రతి విద్యార్థికి 15వేల రూపాయలు తల్లికి వందనం,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,నిరుద్యోగ భృతి మూడు వేల రూపాయలు,యువగళం పేరుతో నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు,అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు ప్రతి సంవత్సరం 20 వే ల రూపాయలు ఇవ్వకపోవడం, ఇవే కాకుండా 50 సంవత్సరా లు నిండిన ఎస్సీ ఎస్టీ బీసీ వారికి పింఛన్ ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడం,పంటలభీమా, సున్నా వడ్డీ రుణాలు రైతులకు ఇవ్వకపోవడం, వ్యవసాయ పంటలకు ధరల స్థిరీకరణ లేనందున పంటలకు గిట్టుబాటు ధరలు పడిపోయి మిర్చి రైతులు అప్పులు పాలు కావడం జరిగినది. నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వైఫల్యం అయింద,భవన నిర్మాణ కార్మికులకు బిఓసి బోర్డును పునరుద్ధరణ,ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు,స్కీం వర్కర్లకు కనీస వేతనాల పైన ఇచ్చిన హామీలను అమలుపరచక




పోవడం,ప్రజలకు ఉచిత ఇసుకను అందిస్తామని చెప్పి అనేక షరతులు పెట్టడంతో ప్రజలకు ఉచిత ఇసుక అందకపోవడం,గత ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చెప్పి తగ్గించకపోగా మరల ప్రజలపై విద్యుత్ బారాలను మోపడం, అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు స్థలం అందజేస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వకపోవడం, రాయలసీమ జిల్లాలలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను నిర్లక్ష్యం చేసి రాజధాని,పోలవరం నిర్మాణం వీటికి మాత్రమే నిధులను కేటాయించి మిగిలిన ప్రాంతాలకు నిధులు కేటాయించకపోవడం పైవాటికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీలు ఇచ్చి అమలు పరచకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం మీద ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. ఇప్పటి కైనా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాము. లేని పక్షంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మీద పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టే పరిస్థితి ఉన్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కమిటీ సభ్యులు రఘునాథ రెడ్డి,సత్తార్,రామాంజనేయు లు,ఐ ఎఫ్ టి యు కమిటీ సభ్యులు రామ్ దాస్, నారాయణ,భాష,షేక్షావలి, విశ్వనాథ్,గోపి,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


# జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ కు సాహిత్య అకాడమీ అనువాద అవార్డు.

ఏప్రిల్ 21,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి కేంద్ర సాహిత్య అకాడమీ, న్యూ ఢిల్లీ ద్వారా సంస్కృత భాషకు సంబంధించిన సాహిత్య అకాడమీ అనువాద అవార్డు 2024 సోమవారం ప్రకటించబడింది. సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ సంస్కృత భాషకు సాహిత్య అకాడమీ అనువాద అవార్డు - 2024 ను అనువాదకుడు డాక్టర్ సోమనాథ్ దాస్ పేరును ఆమోదించారు. డాక్టర్ దాస్ ప్రస్తుతం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో పరిశోధన, ప్రచురణ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా సేవలందిస్తున్నారు. ఆయన ఒడియా సాహిత్యంలో ప్రసిద్ధ రచయిత బ్రజ్ మోహన్ మహంతి గ "లలితలవంగలత" నవలని సంస్కృతంలోకి అనువదించారు. అకాడమీ నియమాలు ప్రకారం, ఈ పుస్తకం ప్రొఫెసర్ ఖగేశ్వర్ మిశ్రా, ప్రొఫెసర్ ఎన్.కె. సుందరేశ్వరన్, ప్రొఫెసర్ రమేశ్చంద్ర భర్ద్వాజ్ గల మూడు సభ్యుల జ్యూరీ మెజారిటీతో ఎంపికైంది. అవార్డు గ్రహీత డాక్టర్ సోమనాథ్ దాస్ తర్వాత ఒక ప్రత్యేక కార్యక్రమంలో తామ్రపత్రం మరియు రూ. 50,000 నగదు బహుమతి అందజేయబడుతుంది.



## వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై జొన్నగిరి ఎస్సై మల్లికార్జున





**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండల కేంద్రంలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ మల్లికార్జున వారి సిబ్బందితో కలిసి జొన్నగిరి చెరువుకట్ట దగ్గర వాహనాలు తనిఖీ సోమవారం, చేపట్టారు. ఎస్సై మల్లికార్జున, మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వవద్దని, అలాగే సరైన పత్రాలు లేని వాహనాలను, నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్డు పై నడిపిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, వాహనాలకు ఉన్న పెండింగ్ చలాన్లు కట్టివేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మల్లికార్జున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకాకుళంలో ప్రజా ఫిర్యాదుల సేకరణ కార్యక్రమానికి 79వినతులు..



**శ్రీకాకుళం ఏప్రిల్ 21, ప్రజా జ్యోతి న్యూస్** శ్రీకాకుళం నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి 79 వినతులు వచ్చాయని జిల్లా అదనపు ఎస్పీ కెవి రమణ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో ముఖాముఖి నిర్వహించామని, వారి యొక్క సమస్యను పూర్తిస్థాయిలో విన్నమన్నారు. వాటిని పరిష్కరించే దిశగా సంబంధిత ప్రాంతాల పోలీస్ సిబ్బందితో మాట్లాడి చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు చెప్పారు.

## మీకోసం'కు 154 వినతులు..



**శ్రీకాకుళం ఏప్రిల్ 21 ప్రజా జ్యోతి న్యూస్..** ప్రజల సమస్యల పరిష్కార వేదికగా శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరం నిలిచింది. సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో "మీ కోసం" కార్యక్రమం జరిగింది. ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, డీపీవో శ్రీధర్ రాజా తదితర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులు ప్రజల నుంచి మొత్తం 154 వినతులను స్వీకరించారు. వాటిలో కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి..

ఎమ్మెల్యే వేగేశన..

ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థిని కి లాప్టాప్ అందజేత..



**బాపట్ల, ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** విద్యార్థులు అన్ని రంగాల్లో చురుకుగా పాల్గొని ముందు వరుసలో నిలవాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు హితవు పలికారు. గుంటూరు జాతీయస్థాయిలో ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఆర్గనైజేషన్ పరీక్షలో బాపట్ల శ్రీనివాస్ నగర్ కాలనీ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని ఆట్ల అభిలాస్య కు గ్రాండ్ ప్రైజ్ లాప్టాప్ సాధించారు. ఈ సందర్భంగా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు చేతులమీదుగా లాప్ టాప్ ను అందజేసి అభిలాస్య శ్రీ ని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్.ఏ.జి.ఎం అంజయ్య, ఆర్.ఐ. అప్పాజీ, ప్రిన్సిపల్ అరుంధతి దేవి, కోఆర్డినేటర్ గోపీచంద్, డీన్ శివకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలి

ఆర్. ఓ మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే కూన రవికుమార్






**ఆమదాలవలస ,ప్రజా జ్యోతి న్యూస్ :** కెనరా బ్యాంక్ ఆమదాలవలస వారి ఆర్థిక సహకారంతో రూ. లక్షా యాభై వేల రూపాయలతో నిర్మించిన ఆర్. ఓ మినరల్ వాటర్ ప్లాంట్ ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే , రాష్ట్ర పి. యూ.సి చైర్మన్ కూన రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన గాలి ఎంత అవసరమో స్వచ్ఛమైన నీరు అంతే అవసరం అన్నారు. ఆర్. ఓ మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని తెలిపారు.

## ప్రభుత్వ గ్రంథాలయానికి 10 సెంట్లు స్థలం కేటాయించండి : యస్.ఏ. సత్తార్



**బద్వేల్ ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పట్టణంలో ప్రభుత్వ గ్రంథాలయానికి 10 సెంట్లు స్థలము కేటాయించాలని కోరుతూ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు యస్.ఏ. సత్తార్ ఈరోజు ఉదయం 11 గంటలకు కడప జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం నందు జాయింట్ కలెక్టర్ అదిత్ సింగ్ గారిని కలిసి సమస్యను విన్నవించుకున్నారు.. బద్వేల్ పట్టణంలో దాదాపు లక్ష మంది జనాభా ఉన్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం గ్రంథాలయానికి సొంత భవనము కొరకు స్థలము కేటాయించలేదని .. ప్రభుత్వ గ్రంథాలయము బాడుగ ఇళ్ళకే పరిమితమైందని అరకొర సౌకర్యాలతో ఉందని అన్నారు. అనేక దఫాలుగా ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ అధికారులకు పలుమార్లు సమస్య చెప్పినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. కాబట్టి ఈరోజు జాయింట్ కలెక్టర్ గారికి బద్వేల్ పట్టణానికి గ్రంథాలయం కొరకు 10 సెంట్లు స్థలము కేటాయించాలని విన్నవించుకున్నారు.. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్ గారు స్పందిస్తూ గ్రంథాలయం స్థలం విషయమై బద్వేల్ రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఆదేశాలు ఇస్తానన్నారు. నెల రోజులలో ఈ సమస్యను పరిష్కరిస్తారని జాయింట్ కలెక్టర్ అదిత్ సింగ్ గారు హామీ ఇచ్చారన్నారు.

## హంద్రీనీవా కాలువకు 10,000 క్యూసెక్కుల నీరు వచ్చే విధంగా కాలువ వెడల్పు చేయాలి: సిపిఎం రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి రాంభూపాల్



గుంతకల్లు ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి):హంద్రీనీవా కాలువకు 10,000 క్యూసెక్కుల నీరు వచ్చే విధంగా కాలువ వెడల్పు చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ వి.రాంభూపాల్ సోమవారం హంద్రీనీవా కాలువను పరిశీలించి డిమాండ్ చేశారు. రాంభూపాల్ మాట్లాడుతూ గుంతకల్లు మండల పరిదిలో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు జరుగుతున్నాయి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన ప్రకారం అధికారంలోకి రాగానే 10,000 క్యూసెక్కుల నీరు ఇస్తాము అన్నారు. ముఖ్య మంత్రి ఇచ్చిన మాట ప్రకారం హంద్ర నీవా కాలువకు పదివేల క్యూసెక్కుల నీరు ఇచ్చి జిల్లాలోని ప్రతి ఎకరాకు నీళ్ల అందే విధంగా చేసి రైతులను కరువు నుండి కాపాడాలన్నారు అంతవరకు లైనింగ్ పనులు చేయకూడ దని రైతులు కోరుతున్నారు ఇప్పటివరకు ఈ ప్రాంతం అతివృష్టి, అనావృష్టి వలన రైతులు చాలా నష్టపోవడం జరిగింది. అలాగే పిల్ల కాలువల ద్వారా రాగులపాడు నుండి ఎత్తిపోతల పథకం ద్వారా వజ్రకరూరు, గుంతకల్లు, పామిడి మండలాలలోని గ్రామ ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించాలి. అలాగే నిన్నటి రోజున కురిసిన గాలి వానకు దెబ్బతిన్న పంటలకు.పండ్ల తోటలకు వెంటనే నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కసాపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారం కోసమే పల్లె నిద్ర,.....

ఆముదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే కూ న రవికుమార్ ..,.....



**ప్రజా జ్యోతి.(బూర్జ )** గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి ఆదేశాల మేరకు ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్ చేపట్టిన పల్లె నిద్ర కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ప్రజాసమస్యల పరిష్కారం కోసమే పల్లె నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. బూర్జ గ్రామంలో బుధవారం రాత్రి పల్లెనిద్ర చేశారు. ప్రాంతాల్లోని అన్ని వీధుల్లో ఎమ్మెల్యే పర్యటించారు.

# జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు..

జిల్లా కలెక్టర్ వెంకట మురళి..

చీరాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్..

జిల్లాలో గిరిజన, విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కారానికి చర్యలు..

వీరి కోసం ప్రతి మూడవ శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక..



**బాపట్ల, ఏప్రిల్ 21(ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్నీ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. సోమవారం చీరాల మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి చీరాల శాసనసభ్యులు ఎం. ఎం కొండయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలను పరిష్క రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో గిరిజన ప్రజలు విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి మూడవ శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాలేని గిరిజన ప్రజలు, మహిళలు, విభిన్న ప్రతిభావంతుల కోసం నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. చీరాల నియోజక వర్గంలో భూములకు సంబంధించి ఇంటి స్థలాలు, గృహ నిర్మాణాలు, పెన్షన్లు గురించి పోలీస్ శాఖకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయని ఆయన అన్నారు. ఓడరేవు పంచాయితీ సిద్దార్ కాలనీలో నిలిచి పోయిన గృహా నిర్మాణాలను ప్రభుత్వ శ్రద్ధ తీసుకొని పూర్తి చేయాలని ప్రజలు కోరారని చెప్పారు. గృహ నిర్మాణ శాఖ అధికారులను పరిశీలించి రెండు రోజుల్లో నివేదికలు ఇవ్వాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చా మన్నారు. చీరాలలో కొంతమంది గిరిజను లు స్మశాన స్థలములో నివాసాలు ఉంటు న్నారని వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చీరాల శాసనసభ్యులు ఎం. ఎం కొండయ్య మాట్లాడుతూ చీరాల నియోజకవర్గ కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలకు జిల్లా స్థాయి అధికారులు రావడం వల్ల సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయని చెప్పారు. చీరాల నియోజకవర్గంలో ఖాళీ భూములను గుర్తించి పేద ప్రజలకు ఇంటిని స్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూఅధికారి జి. గంగాధర్ గౌడ్ , జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ , జిల్లాసాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, చీరాల రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, చీరాల తాసిల్దార్ గోపికృష్ణ, వేటపాలెం తహసీల్దార్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు వారు.. రాధమ్మతో కుమ్మక్కై ప్రజలను మోసం చేశారు

వీరిపై విచారణ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలి.. రూరల్ సీఐ కి సిపిఐ ఫిర్యాదు.....

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు చేతుల్లో మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలి...

సిపిఐ మండల కార్యదర్శి పి. రాము రాయల్ ...

సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ గోపీనాథ్...



**గుంతకల్లు ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి):** మండలంలో జి కొటాల గ్రామం నందు గత కొద్ది రోజులుగా ప్రైవేట్ ఫైనాన్స్ వారి యొక్క ఆగడాలకు అడ్డుకట్టు వేయాలని సిపిఐ మండల కార్యదర్శి పి. రాము రాయల్ ,సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ గోపీనాథ్. ఆధ్వర్యంలో ఫైనాన్స్ వారి చేతుల్లో మోసపోయిన బాధితులు సోమవారం రూరల్ సిఐకి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి సిపిఐ మండల కార్యదర్శి ఎస్ గోపీనాథ్, పి. రాము రాయల్ మాట్లాడుతూ ప్రవేట్ ఫైనాన్స్ వ్యాపారస్తులు తో జతకట్టిన రాధమ్మ ఒక పథకం ప్రకారం కుట్ర పని పేదవారిని టార్గెట్ చేసుకొని మోసపూరితమైన మాటల ద్వారా తన నైపుణ్యాన్ని మాటల ద్వారా నమ్మించి వారి యొక్క ఆధార్ కార్డులు ఓటర్ కార్డు బ్యాంక్ అకౌంట్ లో మరియు ఏటీఎం కార్డు లోని స్వాధీనం చేసుకుంది వీళ్లంతా నిరక్షరాసులు కనీసం వీరికి ఉండడానికి సొంత గూడు గాని లేదు అలాంటి వారికి ఈ ప్రైవేట్ ఫైనాన్స్ వారు ఎటువంటి ఆధారాలు పత్రాలు లేకున్నా ఎటువంటి జామిన్ లేకున్నా వారి పేర్లు పైన వారికే తెలియకుండా లోన్లు ఇచ్చి డబ్బులు తీసుకున్నారు.ఈ ప్రైవేట్ ఫైనాన్స్ వారు రాధమ్మ కలిసి... ఈ అమాయక ప్రజలను మోసం చేశారు. ఫైనాన్స్ వారి నిర్వహణకాలు ఎలా ఉన్నాయి అంటే భార్యాభర్తలు లోన్ ఇవ్వాలన్నా నీ భర్త లేకపోయినా పరవాలే మేము వేరే అతనిని భర్తగా చిత్రీకరించి లోన్ ఇవ్వడం జరిగింది.కొడుకును లేకున్నా వేరే వారే పిల్లవాడిని మరొక ఆమెకి కొడుకుగా చిత్రీకరించి వారికి గానే లోన్లు ఇచ్చారు, అంటే ప్రైవేట్ ఫైనాన్సు వారు ఒక మహిళను అడ్డం పెట్టుకొ ని ఇటువంటి ప్రజలను మోసం చేయడం చూస్తుంటే ఇలాంటి సంఘటనలు ఎన్ని చోట్ల జరిగాయి ఎక్కడెక్కడ జరిగాయి అనేది ఆలోచన చేసిన విషయం అందుకోస మని ఈ ప్రైవేట్ ఫైనాన్స్ వారి యొక్క ఆగడాలను ఇంకా ఎక్కడెక్కడ జరిగాయి అనేది పూర్తి విచారణ చేయాలని వీరి పైన చట్టపరమైనటు వంటి చర్యలు తీసుకోవాలి బాధితులకు న్యాయం చేయాలని సిపిఐ నాయకులు కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సిపిఐ శాఖ కార్యదర్శి డైమండనూర్ వెంకట నాయక్ అఖిల్ రోహిత్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కొనసాగుతున్న కూటమి అరాచకత్వం

దివంగత మహానేత విగ్రహం ధ్వంసం అమానుషం

ధ్వంసానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

వైఎస్సార్సీపీ కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుంపల రామారావు , జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు



**శ్రీకాకుళం రూరల్ ,ఆమదాలవలస, ప్రజా జ్యోతి న్యూస్ :** రాష్ట్రంలో కూటమి అరాచకత్వం రోజురోజుకు పెరిగిపోతుందని ,శ్రీకాకుళం జిల్లా బైరి జంక్షన్ వద్ద నిర్మించిన దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని కూల్చివేసిన ఘటన బాధాకరమని వైసిపి కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్,రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు( లక్ష్మణ రావు ),రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యనారాయణ , జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు,ఆమదాలవలస ఎంపీపీ ప్రతినిధి,మండల పార్టీ అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ మూర్తి ,జెడ్పీటీసీ బెండి గోవింద రావు ,పొందూరు మండల పార్టీ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి , మాజీ మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్,పలువురు వైకాపా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఘటనకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి, చట్టపరంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.108, ఫీజు రియంబర్స్మెంట్, పలు సంక్షేమ పథకాల అమలుతో తెలుగు నేలపై చిరస్థాయిగా రాజశేఖర్ రెడ్డి నిలిచారన్నారు. దివంగర సీఎం రాజశేఖర్ రెడ్డి మరణంతో వందలాది గుండెలు ఆగాయన్నారు. ఇటువంటి మహోన్నత వ్యక్తి విగ్రహాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, ఆదరాభిమానాలతో ఏర్పాటు చేసుకున్నారన్నారు. వైయస్సార్ జయంతి, వర్ధంతి సందర్భంగా, ఆయా రోజుల్లో కన్నుల పండుగగా తమ అభిమాను నేతను స్మరించుకుంటున్నారని వివరించారు. పార్టీలకు అతీతంగా కోట్లాదిమంది మదిలో శాశ్వత స్థానం ఏర్పరచుకున్న మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని నేలపాలు చేయటం బాధాకరం అన్నారు. పైశాచిక ఆనందం పొందటం కోసం దైవాంశ సంభూతుడిగా భావించే దివంగత సీఎం వైయస్సార్ విగ్రహాన్ని నేలమట్టం చేసిన వ్యక్తులు, తమ తప్పును తెలుసుకోవాలన్నారు. ఎక్కడైతే నేల కూల్చారో, అదే చోట విగ్రహాన్ని పున: ప్రతిష్టించి, ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు కూడా ఇటువంటి అనైతిక చర్యలను ముక్తకంఠంతో ఖండించాలని వారు డిమాండ్ చేశారు.

## కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంవత్సరంలోపే ఇచ్చిన హామీని అమలు చేసిన మా అధినాయకుడు చంద్రబాబు నాయుడు




**అనంతపురం ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి):** కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంవత్సరంలోపే ఇచ్చిన హామీని అమలు చేసిన మా అధినాయకుడు చంద్రబాబు నాయుడు కి మరియు యువ నాయకులు నారా లోకేష్ కి నిరుద్యోగుల తరుపున అనంతపురం అర్బన్ నియోజకవర్గం అధ్యక్షులు బొమ్మినేని శివ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా బొమ్మినేని శివ మాట్లాడుతూ మాట తప్పకపోవడం మడమ తిప్పకపోవడం అంటే ఏంటో నారా చంద్రబాబు నాయుడు ని,నారా లోకేష్ ని చూసి జగన్ నేర్చుకోవాలని, గత ఐదేళ్లలో మొద్దు నిద్రలో ఉండి రాష్ట్ర అభివృద్ధి నిరుద్యోగులను మరిచిన జగన్ ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ఒక మూలన కూర్చోవాలని హితువు పలికారు.ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ అభ్యర్థులకు నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగుల్లో ఆనందోత్సా హాల నింపి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన నారా చంద్రబాబునాయుడు కి వారి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

# చీరాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ వెంకట మురళి..
బీచ్ లను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి..
నియోజకవర్గ అభివృద్ధి పై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశం..
త్రాగునీటి పరిష్కారానికి 10.2 కోట్లతో పనులు..
గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి అవసరాలకు 60 లక్షల మంజూరు..
ఉపాధి హామీ పథకం కింద 10 కోట్లతో అభివృద్ధి పనులు..



**బాపట్ల, ఏప్రిల్ 21 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** చీరాల నియోజకవర్గం అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని, బీచ్ లను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. చీరాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, పర్యాటక ప్రాంతం అభివృద్ధిపై జిల్లా స్థాయి అధికారులతో సోమవారం చీరాల పురపాలక సంఘం కార్యాలయంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం చీరాల స్మశాన వాటికను కలెక్టర్, జేసీ, శాసనసభ్యులు పరిశీలించారు. చీరాలలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి 10.2 కోట్ల నిధులతో జల జీవన్ మిషన్ కింద పనులు చేపడతామని జిల్లా కలెక్టర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరా కోసం 60 లక్షలు ఆర్ డబ్ల్యు ఎస్ ద్వారా మంజూరు చేస్తామన్నారు. చీరాల పరిధిలోని అయిదు ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు చేయడానికి యుద్ధప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో 8.25 కోట్లతో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు కేటాయింపులు జరగ్గా అదనంగా మరో 1.75 కోట్ల నిధులు వెచ్చిస్తామన్నారు. డి ఎం ఎఫ్ కింద మరో రెండు కోట్ల నిధులు బీచ్ అభివృద్ధికి మంజూరు చేస్తామన్నారు. వివిధ శాఖలు, ఆయా పథకాల ద్వారా మరో రెండు కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 1.50 కోట్లతో చీరాల పట్టణంలో మురికి నీటి వ్యవస్థ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలు, నిధులను వెచ్చించడానికి పరిశీలిస్తామన్నారు. 150 కోట్లతో చీరాలలో ఫిషింగ్ హార్బర్ నిర్మించడానికి తయారు చేసిన డిపిఆర్ ను యుద్ధ ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలన్నారు. చీరాల వాడరేవు, రామాపురం బీచ్ లలో బయో టాయిలెట్స్ నిర్మిస్తామన్నారు. పర్యాటక రంగంగా మారనున్న బీచ్ ల వద్ద రక్షణ చర్యలు పెంచాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైల్వే ట్రాక్ పై ఆర్ఓబి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మసీద్ సెంటర్లో, పేరాల రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ ను నియంత్రించాలన్నారు. చీరాల పట్టణంలో నిరుపేదలకు ఇంటి స్థల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి పనుల వేగంగా చేపట్టడానికి కొన్నిటికి ప్రతిపాదనలు పంపడం, కొన్నిటికి టెండర్లు పిలవాలని, మరికొన్ని పనులు ప్రారంభించాలని అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. పనులలో జాప్యం చేయవద్దని అధికారులకు సూచించారు. ప్రతి నెల రెండు రోజులు నియోజకవర్గస్థాయిలో పీజీ ఆర్ఎస్ నిర్వహిస్తామని తెలిపారు. అదే క్రమంలో నియోజకవర్గాల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష చేస్తామన్నారు. చీరాల నియోజకవర్గంలో మరుగు నీటి వ్యవస్థను అభివృద్ధి చేయాలని చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాల్వల నిర్వహణ అధ్వానంగా ఉందని, నూతనంగా కాల్వలు నిర్మించాలన్నారు. స్మశాన భూమి ఆక్రమణకు గురవుతుందని, తక్షణమే ఆక్రమణలు తొలగించాలన్నారు. కాల్ మనీ తరహాలో వడ్డీ వ్యాపారులు ప్రజల నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని కోరారు. దెబ్బతిన్న రహదారులు నిర్మించాలన్నారు. ఇంటి స్థలాలు లేక పేదలు కాల్వల గట్లపై నివాసం ఉంటున్నారని కలెక్టర్ కి వివరించారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుందని, సరిగా సరఫరా జరగడం లేదని, నియోజకవర్గంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మించాలన్నారు. ఫిషింగ్ హార్బర్, హ్యాండ్ లూమ్ పార్క్ ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. జగనన్న కాలనీలలో ఖాళీ స్థలాలను నిరుపేదలకు కేటాయించాలన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు అదనంగా కేటాయించి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. చీరాలలో తాగు నీటి సమస్య అధికంగా ఉందని, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. 3000 మంది మహిళలకు కుట్టు శిక్షణలు ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. చీరాల నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి జరిగేలా సహకరించాలని కలెక్టర్ కు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, చీరాల పురపాలక సంఘం చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలి



**జగిత్యాల :** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మెట్పల్లి మండలంలోని మెట్ల చిట్టాపూర్ మహిళా సమాఖ్య ఐకెపి సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ముత్యంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం తేమ శాతం రెగ్యులర్ గా చెక్ చేయాలని, తాలు లేకుండా ప్యాడీ క్లీనర్ ద్వారా శుభ్రం చేయాలని , నాణ్యత ప్రమాణాలు రాగానే ధాన్యాన్ని కొనుగోలు చేసి సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని ఎలక్ట్రికల్ తూకం ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ చేయాలని తెలిపారు. ధాన్యం తరలింపు సమయంలో కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీ వడగళ్ల పడుతాయి కాబట్టి తాటి పత్తర్లు అందుబాటులో తాగునీరు ఉండేలా చూడాలన్నారు. ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తుగా ప్లానింగ్ చేసుకోవాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు అలాట్ చేసిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం తరలింపు అంశంలో రవాణా సమస్య రాకుండా అవసరమైన లారీలను కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ డాటా ఎంట్రీ చేయాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాల్ 2320 రూపాయల, సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్ 2300 రూపాయలు ఉంటుందని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువచ్చిన సీరియల్ నెంబర్ ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేపట్టాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట మెట్ పల్లి ఆర్డీవో శ్రీనివాస్,డిఆర్డిఓ పిడి రఘువరన్, ఎంపీడీవో,ఎమ్మార్వో శ్రీనివాస్, సివిల్ సప్లై అధికారులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సహృదయ భావన చాటుకున్నా ఎస్పీ



**బాపట్ల ఏప్రిల్ 21 (ప్రజాజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** దివ్యాంగులు వృద్ధులు మహిళల ఫిర్యాదులు అత్యంత ప్రాధాన్యతతో చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. పిర్యాదు అందించడానికి కార్యాలయానికి వచ్చి నడవలేని స్థితిలో ఇబ్బంది పడుతున్న వృద్ధులు దివ్యాంగుల వద్దకు ఎస్పీ స్వయంగా వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకునీ సంబంధిత అధికారులను వారి సమస్యలను చట్టపరుదుల పరిష్కరించమని ఆదేశించారు. వివరాలలోకి వెళి తేకర్లపాలెం మండలం గణపవరంకు చెందిన కప్పల వెంకట సుజాత అను మహిళా అంగవైకల్యంతో బాధపడుతు నడవలేని స్థితిలో వున్న దివ్యాంగుడైన ఆమె కుమారుడు యశ్వంత్ కుమార్ ను ఆటోలో తీసుకొని పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చింది. ఆ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సహృదయ భావనతో స్పందించి స్వయంగా కార్యాలయం బయటికి వచ్చి ఆటోలో ఉన్న యశ్వంత్ ను చూసి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. చట్ట పరిధిలో వారి సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ఇదే రీతిలో పిట్లవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన మహమ్మద్ ఇలియాజ్ అను వృద్ధుడు మరి కొంతమంది వృద్ధులు నడవడానికి ఇబ్బంది పడుతుండడంతో వారి వద్దకే వెళ్లి వారి సమస్యను తెలుసుకున్నారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు వారి సమస్యల పరిస్కారం కోసం పోలీస్ స్టేషన్లకు, కార్యాలయాలకు వచ్చినప్పుడు వారిపట్ల పోలీస్ అధికారులు సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. వారి ఫిర్యాదులకు ముఖ్య ప్రాధాన్యతనిచ్చి, చట్ట పరిధిలో విచారించి బాధితులకు తగిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు. అర్జీలను పరిష్కరించడంలో జాప్యత వహించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా సంబంధిత అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 71 మంది అర్జీదారులు వారి సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకొని వ్రాతపూర్వకమైన అర్జీలను అందజేసినారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, సిసిఎస్ డిఎస్పి జగదీష్ నాయక్ ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల :** గ్రీవెన్స్ డే బాధితుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆన్నారు. జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా, సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి, సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని, ప్రతి కేసుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

## ఎంఐఎంకు ఓటు వేస్తే హిందూ ద్రోహులే




**హైదరాబాద్ :** 22 ఏళ్ల తర్వాత హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక జరుగుతోంది. అయితే ఈసారి ఎన్నికల్లో బీజేపీ, ఎంఐఎం పోటీపడుతున్నాయి. ఓ వైపు మజ్లిస్ కు మొగ్గ ఉన్నా.. విజయం మాత్రం తమదే అని ధీమా వ్యక్తం చేస్తోంది భారతీయ జనతా పార్టీ. అయితే ఎంఐఎం వర్సెస్ బీజేపీ పోరులో ఫలితం ఎలా ఉండబోతుంది..? ఎంఐఎంను అడ్డుకునేందుకు బీజేపీ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది..? అన్నది ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో పొలిటికల్ హీట్‌గా మారింది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోలింగ్ కు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకోగా.. ఎన్నికల్లో పార్టీ వైఖరిపై రాజకీయ ప్రయోజనాల మేరకు నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ప్రకటించిన విషయం తెలిసిందే. బీజేపీ అనూహ్యంగా అభ్యర్థిని బరిలో దింపింది. గౌతం రావును పార్టీ అభ్యర్థిగా నిలబెట్టింది. దీంతో ఈ ఎన్నిక ప్రస్తుతం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 23 న జరగనున్న ఎన్నికలకు మొత్తం 112 మంది ఓటర్లుగా ఉన్నారు. అత్యధిక ఓట్లు ఎంఐఎంకు ఉండగా.. తర్వాత స్థానంలో బీజేపీకి ఉంది. ఎంఐఎంకు 49 ఓట్లు ఉన్నాయి. అయితే ఈ ఓట్లతో ఇతర పార్టీల మద్దతుపై ఎంఐఎం నమ్మకం పెట్టుకుంది. ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీని బరిలో ఉన్నారుబీజేపీ ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో తమదే విజయం అనే ధీమాతో ఉంది. మొత్తం ఓటర్ల సంఖ్య 112. ఇందులో 81 మంది కార్పొరేటర్లు ఉండగా.. 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు కూడా ఉన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యుల్లో 9 మంది ఎంపీలు, 15 మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎమ్మెల్సీలు ఉన్నారు. ఎంఐఎం, బీఆర్ఎస్‌కు ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు 9 చొప్పున ఉండగా.. కాంగ్రెస్‌కు 7, బీజేపీకి ఆరు ఓట్లు ఉన్నాయి. అయితే, హైదరాబాద్ స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల వేల బ్యానర్లు కలకలం రేపుతున్నాయి. హిందువుల పేరుతో ఈ బ్యానర్లు వెలిశాయి. హైదరబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకే ఓటు వేయాలంటూ బ్యానర్లలో రాసి ఉంది. ఓఎఓకు ఎట్టిపరిస్థితుల్లో ఓటు వేయొద్దంటూ.. అంటూ ఫ్లెక్సీ లో ఉంది. ఓటింగ్ లో పాల్గొని ఓఎఓ వ్యతిరేకంగా ఓటు వేయాలని బ్యానర్లలో తెలిపారు. తమకు ఓటు వేయకుంటే హిందూ ద్రోహులు అంటూ నగరంలోని పలు ప్రాంతాల్లో బ్యానర్లు వెలిశాయి.

# రజతోత్సవం టీఆర్ఎస్‌కా, బీఆర్ఎస్‌కా?




**హైదరాబాద్ :** బీఆర్ఎస్ రజతోత్సవ వేళ ఆ పార్టీపై సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. రజతోత్సవానికి గులాబి దళం హడావిడి చేస్తుంది కానీ, కార్యకర్తల్లో పెద్దగా స్పందన లేదని, కనీసం స్థానిక నేతలు కూడా ఆ సభ విషయంలో ఉత్సాహంగా లేరని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. అసలు పార్టీ పెట్టినప్పుడు ఉన్నవాళ్లెవరూ ఇప్పుడు కేసీఆర్ వెంట లేరు కదా అని లాజిక్ తీస్తున్నారు. మధ్యలో వచ్చినవాళ్లు, అవకాశవాదులతో ఉన్న ఆ పార్టీకి అసలు రజతోత్సవాలు ఎందుకంటూ వెటకారం చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర సమితి అనే పేరుతో పార్టీ పెట్టి, భారత రాష్ట్ర సమితి అనే పార్టీకి రజతోత్సవాలు ఎలా చేస్తారంటూ సూటిగా ప్రశ్నించారు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి. ఆ పార్టీ తెలంగాణ గొంతుక కాదని, గొంతు కోసిన పార్టీ అని ధ్వజమెత్తారు. కేసీఆర్ అర్జెంట్‌గా సీఎం ఎందుకు కావాలో కేటీఆర్ వివరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ను వద్దని ప్రజలు ఇంటికి పంపించారని.. ఎన్నికల వరకు ఆగలేని కేటీఆర్ అర్జంట్ గా అధికారం కావాలని కోరుకోవడం హాస్యాస్పదం అని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలా? అని ప్రశ్నించారు.

తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం రోజున ఉన్న కీలక నేతలు ఇప్పుడు కేసీఆర్ వెంట ఎందుకు లేరని ప్రశ్నించారు ఎంపీ చామల. ఆ విషయాన్ని ఓసారి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేటీఆర్, కవిత అమెరికాలో ఉన్నారని.. ఇప్పుడు పార్టీలో కేసీఆర్ కుటుంబ సభ్యులు మినహా ఎవరు మిగిలారని ప్రశ్నించారు. తుపాకీ రాముడు, రబ్బర్ చెప్పుల హరీష్, లిక్కర్ కవిత, హ్యాపీ రావు తప్ప బీఆర్ఎస్ లో ఎవరున్నారని కౌంటర్లిచ్చారు. తెలంగాణ కోసం పార్టీలో చేరినవారెవరూ ఇప్పుడు అక్కడ లేరని, కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులే ఉన్నారని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడినవాళ్లు.. అసలు విషయం తెలుసుకుని కేసీఆర్ కి దూరం జరిగారన్నారు. ఒకరకంగా వారందర్నీ కేసీఆరే బయటకు పంపించారని చెప్పారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంని చేస్తానని కేసీఆర్ మోసం చేశారని, మూడు ఎకరాలు భూమి ఇస్తానని మోసం చేశారని, కాళేశ్వరం పేరుతో కోట్ల రూపాయల సొమ్ము దోచుకున్నారని.. అలాంటి వ్యక్తిని తిరిగి సీఎం ఎందుకు చేయాలన్నారు ఎంపీ చామల. కేసీఆర్ మంచి అడ్మినిస్ట్రేటర్ అయితే తెలంగాణ అప్పుల పాలెందుకైందని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు.కాంగ్రెస్ చేసిన కులగణన వల్ల బీఆర్ఎస్ పార్టీలో వణుకు మొదలైందని, రజతోత్సవ సభలో ఆ పార్టీకి బీసీ నాయకుడిని అధ్యక్షుడిగా ప్రకటిస్తారని తమకు సమాచారం ఉందని, అదే నిజమైతే తాము ఆ పరిణామాన్ని ఆహ్వానిస్తామని చెప్పారు ఎంపీ చామల. 9 ఏళ్లపాటు తెలంగాణ ప్రజల్ని దోచుకున్నందుకు, అభివృద్ధి పేరు చెప్పి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినందుకు రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# బిగ్‌బాస్ ఫేం అమర్‌దీప్ కొత్త సినిమా షురూ

బిగ్‌బాస్ షోతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న నటుడు అమర్‌దీప్ చౌదరి కొత్త సినిమా 'సుమతీ శతకం' ఘనంగా ప్రారంభమైంది. సన్నీ లియోన్ నటించిన 'మందిర' చిత్రంతో విజయం సాధించిన విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో, కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంతో ఎం.ఎం. నాయుడు దర్శకుడిగా తొలి అడుగు వేస్తున్నారు. ఈ చిత్రంలో అమర్‌దీప్ చౌదరి, సైలీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా అమరావతిలోని వైకుంటపురం విలేజ్ టెంపుల్‌లో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తం కార్యక్రమంలో చిత్ర తారాగణం, సిబ్బందితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ముహూర్తం షాట్‌కు క్లాప్ కొట్టగా, వెన్నా సాంబశివారెడ్డి కెమెరా స్విచాన్ చేశారు. 'సుమతీ శతకం' కథను బండారు నాయుడు అందించగా, సుభాష్ ఆనంద్ సంగీతం సమకూరుస్తున్నారు. సినిమాటోగ్రఫీని హాల్‌స్వామి, ఎడిటింగ్‌ను సురేష్ విన్నకోట నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానుందని నిర్మాతలు ప్రకటించారు.

# లోకల్ ట్రైన్‌లో ఆ హీరోయిన్‌కి చేదు అనుభవం.. ఏకంగా ముద్దే అడిగేశాడుగా..!

సినీ సెలబ్రిటీలు కూడా కొన్ని సార్లు విచిత్ర పరిస్థితులు ఎదుర్కొంటూ ఉంటారు. సోషల్ మీడియా ద్వారానో లేదంటే పలు ఇంటర్వ్యూలలోనో తమకి ఎదురైన చేదు అనుభవాల గురించి వివరిస్తూ ఉంటారు. నటి మాళవిక మోహనన్‌కి కూడా విచిత్ర పరిస్థితి ఎదురైందట. మాళవిక మోహన్ హిందీ, కన్నడతో సహా పలు భాషల్లో నటించారు. ముంబైలో పుట్టి పెరిగిన మాళవిక మోహన్, దక్షిణ భారతంలోనే ఎక్కువ అవకాశాలు పొందారు. ఇటీవల ఈ అమ్మడు హాట్ కామెంట్స్ చేస్తూ వార్తలలో నిలుస్తూ ఉన్నారు. ఓ ఇంటర్వ్యూలో దక్షిణ భారత సినిమా దర్శక నిర్మాతల ఆసక్తి గురించి మాట్లాడుతూ వారు నాభిపై ఎక్కువ ఫోకస్ పెడతారని, నాభిని జూమ్ చేసి చూపిస్తారని, క్లోజప్ షాట్‌లు తీస్తారని అది చాలా ఇబ్బందిగా ఉంటుందని పేర్కొంది. అలానే తనతో, తన స్నేహితులతో ఇబ్బందికరంగా ప్రవర్తించడం గురించి ఓపెన్ అయింది. ముంబయిలో ఓ రోజు రాత్రి నా స్నేహితులతో కలిసి లోకల్ ట్రైన్‌లో జర్నీ చేస్తుండగా, ఆ సమయంలో మేము కాకుండా ఆ కంపార్ట్‌మెంట్‌లో ఎవరు లేరు ..ఆ టైంలో ఓ వ్యక్తి అందులోకి వచ్చేందుకు యత్నించాడు. కంపార్ట్‌మెంట్ వద్ద ఉన్న గ్లాస్ డోర్ నుంచి తొంగిచూస్తూ ముద్దిస్తావా అంటూ సైగలు చేయడంతో నేను, నా ఫ్రెండ్స్ భయపడ్డాం. మాకు ఏం చేయాలో అర్థం కాక వణికిపోయాం. దాదాపు 10 నిమిషాల తర్వాత వేరే స్టేషన్ రాగానే అక్కడ కొంతమంది ప్రయాణికులు మా కంపార్ట్‌మెంట్‌లో ఎక్కారు. అప్పుడు మేము ఊపిరి పీల్చుకున్నాం అని మాళవిక చెప్పుకొచ్చింది. 21 ఏళ్లకే హీరోయిన్‌గా కెరీర్ మొదలు పెట్టిన తాను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో లుక్స్ పరంగా విమర్శలు ఎదుర్కొన్నట్లు చెప్పుకొచ్చింది. తన తొలి సినిమా రిలీజ్ అయ్యాక చాలా సన్నగా ఉన్నానని ఎంతో మంది ట్రోల్ చేశారట. 'ఫస్ట్ సినిమా తర్వాత నా శరీరాకృతి ఎంతో మారింది. కొంచెం బొద్దుగా మారిన తర్వాత కూడా విమర్శించారు. దక్షిణాది చిత్రాల్లో కనిపించాలంటే అమ్మాయి కాస్త బొద్దుగా ఉండాలి. హీరోయిన్స్ బొడ్డు మీదే ఎక్కువగా ఫోకస్ పెడతారు అంటూ కామెంట్స్ చేసింది.. హీరోయిన్స్ కూడా బొడ్డు కనిపించేలా దిగిన ఫొటోలని సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు అంటూ మాళవిక కామెంట్స్ చేసింది. మాళవిక ప్రభాస్ లేటెస్ట్ మూవీ 'ది రాజాసాబ్'తో తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు.





# ఏడువారాల మొక్కు.. రెండోవారానికే సినిమా ఆఫర్.. ఈ గుడి చాలా పవర్‌ఫుల్

తొలి సినిమాతో హిట్టందుకోవడం కొందరికే సాధ్యమవుతుంది. కానీ ఈ బ్యూటీ ఏకంగా బ్లాక్ బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకుంది. తనే కోర్ట్ మూవీ హీరోయిన్ శ్రీదేవి ఈ కాకినాడ పిల్ల సోషల్ మీడియాలో రీల్స్ చేసి ఫేమస్ అయింది. ఆ పాపులారిటీతోనే కోర్ట్ సినిమా నుంచి పిలుపొచ్చింది. ఆడిషన్‌లో సెలక్ట్ అవడంతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చింది.

ఆ గుడికి వెళ్లాకే..

అయితే కోనసీమ తిరుమలగా పిలుచుకునే వాడపల్లి వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లాకే తనకు కోర్ట్ సినిమా వచ్చిందంటోంది శ్రీదేవి. తాజాగా వాడపల్లి దేవాలయాన్ని సందర్శించి మొక్కులు కూడా సమర్పించుకుంది. ఆమె మాట్లాడుతూ.. మంచి సినిమా ఛాన్స్ రావాలని వాడపల్లి దేవుడిని కోరుకున్నాను. ఇందుకోసం ఏడువారాలపాటు ఆలయానికి వస్తానని మొక్కుకున్నాను.

ఈ గుడిలో అనుకున్నవన్నీ జరిగాయి

రెండోవారానికే నాకు కోర్ట్ సినిమా ఆఫర్ వచ్చింది. సినిమా కూడా చాలా పెద్ద హిట్టయింది. ఇప్పుడు ఏడువారాలు పూర్తయ్యాయి. ఒక పూజ చేయించుకునేందుకు ఆలయానికి వచ్చాను. ఇక్కడ ఏం అనుకున్నా నెరవేరుతుంది. నాకు చాలా మంచి జరిగింది. నేను కోరుకున్నవన్నీ జరిగాయి అని శ్రీదేవి చెప్పుకొచ్చింది. ఇంతకీ ఈ గుడి ఎక్కడుందంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆత్రేయపురం మండలంలోని వాడపల్లిలో ఉంది.

# మారణహోమానికి సిద్ధమైన ఎన్టీఆర్

## జూనియర్ అభిమానులు ఫుల్ ఖుష్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాల కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురు చూస్తుంటారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్ హీరోగా పేరు ప్రఖ్యాతలు అందిపుచ్చుకున్న ఎన్టీఆర్ ఆ తర్వాత వచ్చిన దేవర చిత్రంతో ఫుల్ క్రేజ్ సంపాదించుకున్నాడు. దేవర తర్వాత ఎన్టీఆర్ ఏ హీరోతో సినిమా చేయనున్నాడు, షూటింగ్ ఎప్పుడు మొదలు పెడతాడు, ఎప్పుడు పూర్తి చేస్తాడు అనే అనుమానాలు అందరిలో ఉన్నాయి. ఇప్పుడు అభిమానుల ఆనందాన్ని రెట్టింపు చేసేందుకు యంగ్ టైగర్ ఏప్రిల్ 22 నుంచి కర్ణాటకలో జరగనున్న షూటింగ్ లో పాల్గొననున్నాడు. ఎన్టీఆర్ హైదరాబాద్ ను వదిలి కర్ణాటకకు వెళ్లాడు. కర్ణాటక వెళ్తూ ఎయిర్‌పోర్టులో తన నిర్మాతలతో మాట్లాడుతూ కనిపించాడు. ఆ సమయంలో ఎన్టీఆర్‌ని తమ కెమెరాలలో బంధించారు. ఎన్టీఆర్ లుక్ అయితే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడు లేనంత సన్నగా , స్టైలిష్ గా కనిపిస్తున్నాడు. జాకెట్ లాంటి షర్ట్, కళ్లకు అద్దాలు పెట్టుకుని తన లుక్‌తో ఆకట్టుకున్నాడు ఎన్టీఆర్. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ సినిమాలో ఎన్టీఆర్ ను నీల్ చాలా కొత్తగా ప్రెజెంట్ చేయాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమా ఆడియన్స్ కు నెక్స్ట్ లెవెల్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుందని చిత్ర యూనిట్ చెప్తోంది. ఇటీవల ఈ హై ఓల్టేజ్ యాక్షన్ మూవీ చిత్రీకరణ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో మొదలైంది. ఈ క్రేజీ మూవీ సెట్స్‌లోకి ఎన్టీఆర్ ఎప్పుడెప్పుడు అడుగు పెడతాడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు ఆ సమయం వచ్చేసింది. ఎన్టీఆర్ సెట్స్ లో అడుగుపెట్టబోతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేస్తూ.. మారణహోమానికి ముందు ప్రశాంతత.. అంటూ ఎన్టీఆర్ షూటింగ్ కోసం స్టార్ట్ అయిన వీడియోను షేర్ చేసింది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లలో నవీన్ యెర్నేని, రవిశంకర్, నందమూరి కళ్యాణ్ రామ్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బ్లాక్ బస్టర్ హిట్స్‌ను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ యూనిక్ మాస్ విజన్‌తో ఎన్టీఆర్‌ను సరికొత్త మాస్ అవతార్‌లో చూపించబోతున్నారు. ఇది సినీ ఇండస్ట్రీలో సరికొత్త మైలురాయిని సృష్టించనుందని అంటున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com